
RNI No. APTEL/2009/28868

# సిటిజన్ టైమ్స్

తెలుగు దినపత్రిక

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం



CITIZEN TIMES TELUGU DAILY

VOLUME: 17 | ISSUE: 231 | EDITOR: KANCHERLA SANDEEP KUMAR | VISAKHAPATNAM 17-3-2026 | Pages: 8 | Rs: 2/-

సంపుటి : 17 | సంచిక :231 | ఎడిటర్ : కంచర్ల సందీప్ కుమార్ | విశాఖపట్నం 17-3-2026 | పేజీలు : 8 | రూ: 2/-

## ఇకపై ఈ త్యాగమూర్తి విగ్రహం

# ‘స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్’గా నిలుస్తుంది

గత పాలనపై, రాజధాని విధ్వంసంపై ఆవేదన

అభివృద్ధి, సంక్షేమం మా లక్ష్యం

ఆర్యవైశ్యులకు భరోసా.. కీలక నిర్ణయాలు

పవన్ చొరవతో ‘అమరజీవి జలధార’




**అమరావతి, సిటిజన్ టైమ్స్**

తెలుగు జాతి ఆత్మగౌరవం కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో నవ్యాంధ్ర ప్రదేశ్ రాజధాని అమరావతిని ప్రపంచస్థాయిలో నిర్మించి



తీరుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణమైన పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా, ఆయన 58 రోజుల నిరాహారదీక్షకు గుర్తుగా అమరావతిలోని శాఖమూరు పార్కులో ఏర్పాటు చేసిన 58 అడుగుల భారీ విగ్రహాన్ని చంద్రబాబు సోమవారం ఆవిష్కరించారు. ఈ విగ్రహానికి ‘స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్’ (త్యాగనిరతికి ప్రతీక) అని నామకరణం చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు టీజీ భరత్, నారాయణ, సవిత, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్,

తరువాయి 2లో..



## పశ్చిమాసియా ఉద్రిక్తతలు..

# 5,500కుపైగా విమానాలు రద్దు

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

ఇజ్రాయెల్-అమెరికా, ఇరాన్‌ల మధ్య దాడులు, ప్రతిదాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అగ్రరాజ్య స్థావరాలపై దాడుల పేరిట ఈ ప్రాంతంలోని దేశాలపై ఇరాన్ డ్రోన్లు, క్షిపణులను ప్రయోగిస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో భారత్ నుంచి ఇప్పటివరకు 5,500కు పైగా విమానాలు రద్దయినట్లు పౌర విమానయానశాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు రాజ్యసభలో వెల్లడించారు. ఇందులో భారత విమానయాన సంస్థలకు చెందిన 4,335, విదేశీ సంస్థలకు చెందిన 1,187 విమానాలు ఉన్నాయని తెలిపారు. “పశ్చిమాసియాలో గగనతలం మూసివేతల కారణంగా ఈమేరకు విమాన సర్వీసులు రద్దయ్యాయి. ప్రస్తుత సంక్షోభ సమయంలో విమానయాన కార్యకలాపాల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాం. పౌర విమానయానశాఖ, డీజీసీఏలు పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాయి. అవకాశం లభించినప్పుడల్లా విమానాలు నడుపుతున్నాం. ఇలా ఇప్పటివరకు దాదాపు 2.19 లక్షల మందిని చేరవేశాం. ఇప్పటికీ కొన్ని గగనతలాలు మూసిఉన్నాయి. అవి అందుబాటులోకి వచ్చి, సురక్షిత పరిస్థితులు ఏర్పడినప్పుడే విమానాల రాకపోకలు సాధారణ స్థితికి చేరుకోగలవు” అని ప్రశ్నోత్తరాల సమయంలో ఓ ప్రశ్నకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు (ఝఎఎశీష్ట్రుఅ చీఝఱంబ) సమాధానం ఇచ్చారు.

**పశ్చిమాసియా గగనతలంలో ప్రళయకాల విమానం..:** గతేడాది డిసెంబరులో ఇండిగో విమానాలు పెద్దసంఖ్యలో రద్దయిన వ్యవహారంలో.. ప్రయాణికులకు ట్రావెల్ కూపన్ల రూపంలో రూ.163.92 కోట్ల మేర పరిహారం ఇప్పటికే అందినట్లు కేంద్ర మంత్రి తెలిపారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా, ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ప్రయాణికులకు మరింత పరిహారం చెల్లించేలా విమానయాన సంస్థతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు వెల్లడించారు.

## ఇరాన్‌పై దాడులకు మోదీ పర్యటనకు ఏ సంబంధం లేదు

### ఇజ్రాయెల్ రాయబారి



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

ఇరాన్‌పై దాడులకు ప్రధాని మోదీ పర్యటనకు మధ్య ఎలాంటి సంబంధం లేదని భారత్‌లోని ఇజ్రాయెల్ రాయబారి రువెన్ అజార్ వెల్లడించారు. ఈ దాడులు, మోదీ పర్యటనకు లింక్ చేస్తూ జరుగుతోన్న చర్చను తోసిపుచ్చారు. ఈ మేరకు సోమవారం జాతీయ వార్తా ఏజెన్సీతో మాట్లాడారు. “ప్రధాని మోదీ పర్యటనకు ముందే మా ప్రాంతంలో పరిస్థితులు అస్థిరంగా ఉన్న సంగతి తెలిసిందే. మోదీ వెళ్లిన 2 రోజుల తర్వాత ఈ ఆపరేషన్ చేపట్టేందుకు మాకు అవకాశం లభించింది” అని అజార్ పేర్కొన్నారు. తొమ్మిదేళ్ల తర్వాత

తరువాయి 2లో..

### యుద్ధరంగంలోకి తొలిసారి

## ఇరాన్ ‘డ్యాన్సింగ్ మిసైల్’..



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలు, ఆస్తులే లక్ష్యంగా ఇరాన్ దాడులు కొనసాగిస్తోంది. బహ్రెయిన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) వంటి దేశాల పైకి భారీగా క్షిపణులు, డ్రోన్లను ప్రయోగిస్తోంది.

తరువాయి 2లో..

## భారత్‌కు భారీ ఊరట..

క్షేమంగా ముంద్రా పోర్టుకు చేరుకున్న ఎల్పీజీ ట్యాంకర్ ‘శివాలిక్’




**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, భారత్‌కు ఇంధన సరఫరా విషయంలో భారీ ఊరట

తరువాయి 2లో..

## నేటి రాజకీయాలపై వెంకయ్యనాయుడు కీలక వ్యాఖ్యలు




**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

రాజకీయాల్లో డబ్బు ప్రభావం విపరీతంగా పెరిగిపోయిందని, దీనివల్ల నాణ్యత, బాధ్యత కలిగిన వ్యక్తులు

తరువాయి 2లో..

# యువగళంలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్నా

‘స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్’ ఆవిష్కరణలో మంత్రి లోకేశ్


**అమరావతి, సిటిజన్ టైమ్స్**

అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహం ఏర్పాటు చేస్తానని యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నానని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. ప్రజారాజధాని అమరావతిలో తన హామీకి ప్రతిరూపంగా నిలిచిన ‘స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్’ ఆవిష్కరణ తనకెంతో ఆనందాన్నిచ్చిందని ఆయన పేర్కొన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతిని పురస్కరించుకుని, ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆయన సాగించిన 58 రోజుల ఆమరణ నిరాహార దీక్షకు ప్రతీకగా 58 అడుగుల ఎత్తైన కాంస్య విగ్రహాన్ని అమరావతిలోని శాఖమూరులో

తరువాయి 2లో..



## 18న జూన్ నెల శ్రీవారి ఆర్జిత సేవల టికెట్ల విడుదల



**తిరుమల, సిటిజన్ టైమ్స్**

భక్తుల సౌకర్యార్థం 2026 జూన్ నెలకు సంబంధించిన శ్రీవారి ఆర్జిత సేవల (సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవ) టికెట్లకు ఎలక్ట్రానిక్ డిప్‌లో పేర్ల నమోదు ఈ నెల 18న ఉదయం 10 గంటలకు తితిదే వెబ్‌సైట్‌లో ప్రారంభం కానుంది. ఈ టికెట్లకు ఈ నెల 20న ఉదయం 10 గంటల

తరువాయి 2లో..

## ఎడిటోరియల్

### నువ్వా–నేనా..

### మంత్రులకే లోకల్ పరీక్ష ..!

స్థానిక సంస్థల ఎన్నికల బాధ్యతను సీఎం చంద్రబాబు నేరుగా మంత్రుల చేతుల్లో పెట్టారు. వారికే బాధ్యతలు అప్పగిస్తున్నట్టుగా తేల్చేశారు. ఏప్రిల్ రెండో తేదీ నాటికి పంచాయతీలకు గడువు ముగుస్తుంది. దీంతో వాటికి ఎన్నికల నిర్వహించాలి. అయితే ప్రస్తుతం ప్రత్యేక అధికారులను నియమిస్తున్నట్టు ప్రభుత్వం అధికారికంగానే ప్రకటించింది. పంచాయతీలో జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి పూర్తి అయ్యేందుకు మరో రెండు మూడు మాసాల గడువు ఉన్న నేపథ్యంలో అప్పటివరకు ప్రత్యేక అధికారుల పాలన కొనసాగించి.. అభివృద్ధికి అడ్డు లేకుండా కార్యక్రమాలు పూర్తి చేసుకునేందుకు అవకాశం ఉంటుందని ప్రభుత్వం ఆలోచనగా ఉంది. సెప్టెంబర్ నాటికి మున్సిపల్ ఎన్నికలు కూడా వచ్చేందుకు అవకాశం ఏర్పడింది. సెప్టెంబర్ నుంచి మున్సిపల్ ఎన్నికలు కూడా జరిగేందుకు అవకాశం ఉంది. దీంతో మున్సిపాలిటీల్లో కూడా కూటమి పార్టీలు గెలుపు గుర్రం ఎక్కాలన్నది సీఎం చంద్రబాబు ఆలోచన. అంతేకాదు వీటిని ప్రతిష్టాత్మకంగా కూడా ఆయన తీసుకుంటున్నారు. బలమైన కూటమి పార్టీలకు ఎన్నికలు ప్రతిష్టాత్మకమైనవని కూడా ఆయన భావిస్తున్నారు. ఎన్నికలు సహా విజయం దక్కించుకునే బాధ్యతలను ఆయన మంత్రులకే అప్పగించారు. కానీ వాస్తవ పరిస్థితిని గమనిస్తే జిల్లా స్థాయిలో మంత్రుల పరిస్థితి కొంత ఇబ్బందికరంగానే ఉంది. ఇన్చార్జి మంత్రులుగా ఉన్నటువంటి వారికి స్థానికంగా నాయకులతో కలివిడి లేకపోవడం, మంత్రులు చెప్పిన మాటలను వినిపించుకోకపోవడం వంటివి తరచుగా వివాదానికి దారితీస్తున్నాయి. ముఖ్యంగా ఎమ్మెల్యేలకు మంత్రులకు మధ్య కూడా గ్యాప్ నడుస్తుంది. కర్నూలు, అనంతపురం, విజయనగరం, విశాఖపట్నం అదేవిధంగా తూర్పుగోదావరి జిల్లాల్లోనూ ఇన్చార్జి మంత్రులకు స్థానికంగా ఉన్న ఎమ్మెల్యేలకు మధ్య వివాదాలు కొనసాగుతున్నాయి. ఈ వివాదాలను పరిష్కరించేందుకు సమన్వయ కమిటీ ఏర్పాటు చేసినప్పటికీ ఆ కమిటీ కూడా ఎక్కడా పని చేస్తున్నట్టుగా కనిపించడం లేదు. సో ఈ వివాదాలను ఇలా పెట్టుకుని స్థానిక సంస్థల్లో మళ్ళీ మంత్రులకు బాధ్యతలు అప్పగించడం ద్వారా ఏ మేరకు వారు పుంజుకుంటారు.. ఏ మేరకు పార్టీని ముందుకు తీసుకువెళ్తారు.. కూటమి పార్టీలను ఏ విధంగా విజయం దక్కించుకునేలా చేస్తారు అన్నది ఆసక్తిగా మారింది. ఏది ఏమైనప్పటికీ ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో మంత్రులకు బాధ్యతలు అప్పగించిన చంద్రబాబు క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేయడంతో పాటు నాయకులను ముందుకు నడిపించడం వంటి కీలక బాధ్యతలను కూడా వారికి అప్పగించారు. దీంతో ఏ మేరకు వారు సక్సెస్ చేస్తారు అనేది చూడాలి. మరోవైపు వైసీపీ కూడా వ్యూహాత్మకంగానే అడుగులు వేసేందుకు సిద్ధమైంది. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో చర్చకు పెట్టేలాగా క్షేత్రస్థాయిలో కమిటీలను నియమించనున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దీనిపై త్వరలోనే జగన్ నిర్ణయం తీసుకుంటారని కూడా అంటున్నాయి. ఈ క్రమంలో ఇటు మంత్రులు అటు వైసిపి నాయకులు ఏ విధంగా పరస్పరం రాజకీయాలని ఎదుర్కొంటారు. ప్రజల్లో ఏవిధంగా సానుభూతిని సొంతం చేసుకుంటారు అనేది చూడాలి.

### ఇరాన్‌పై దాడులకు మోదీ పర్యటనకు ఏ సంబంధం లేదు

ఫిబ్రవరి 25–26 తేదీల్లో భారత ప్రధాని ఇజ్రాయెల్‌లో పర్యటించారు. ఆ సందర్భంగా బెంజమిన్ నెతన్యాహుతో పలు అంశాలపై చర్చలు జరిపారు. ఆ తర్వాత రెండు రోజులకు ఫిబ్రవరి 28న ఇజ్రాయెల్–అమెరికా సంయుక్తంగా ఇరాన్‌పై దాడులు ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ పరిణామాలపై ఇటీవల కాంగ్రెస్ విమర్శలు చేసింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల పెరుగుదలకు భారత్ మద్దతు ఉందన్న భావన ప్రధాని పర్యటన కలిగిస్తోందని హస్తం పార్టీ నేత సల్మాన్ ఖుర్షీద్ వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే.


**నెతన్యాహు జీవించే ఉన్నారు..**

నెతన్యాహు ప్రాణాలు కోల్పోయారంటూ నెట్టింట్లో ప్రచారం జరుగుతోంది. దానిని అజార్ తోసిపుచ్చారు. తమ ప్రధాని జీవించే ఉన్నారని వెల్లడించారు. ఆయన ఒక కాఫీ షాప్‌నకు వెళ్లిన వీడియో ఏఐది కాదని, నిజమైనదేనని తెలిపారు. ఈ యుద్ధం వేళ పెద్దఎత్తున అసత్య ప్రచారం చక్కర్లు కొడుతోందన్నారు.

**అలీ ఖమేనీ విమానం ధ్వంసం: ఇజ్రాయెల్ వెల్లడి**

ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నాయి. నిన్న రాత్రి మెహ్రాబాద్ ఎయిర్‌పోర్ట్‌పై జరిగిన దాడిలో మాజీ సుప్రీం లీడర్ ఆయతుల్లా ఖమేనీకి చెందిన వ్యక్తిగత విమానం ధ్వంసమైనట్లు నెతన్యాహు సేనలు వెల్లడించాయి.

# ఇకపై ఈ త్యాగమూర్తి విగ్రహం 'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్'గా నిలుస్తుంది



పలువురు ఎమ్మెల్యేలు, నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. స్ఫూర్తికి మారుపేరు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. "అమెరికాలో స్టాట్యూ ఆఫ్ లిబర్టీ, గుజరాత్‌లో స్టాట్యూ ఆఫ్ యూనిటీ ఉన్నాయి. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో మనందరి కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడి గుర్తుగా 'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్' ఉంది. ఆయన ఒక కులానికి చెందిన వ్యక్తి కాదు, తెలుగు ప్రజలందరి వాడు. ఆయన త్యాగాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలి" అని చంద్రబాబు పిలుపునిచ్చారు. తపాలా శాఖ రూపొందించిన అమరజీవి పొట్టి శ్రీరాములు పోస్టల్ కవర్‌ను ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఆవిష్కరించారు.

**గత పాలనపై, రాజధాని విధ్వంసంపై ఆవేదన**

గత ఐదేళ్ల పాలనలో రాజధాని అమరావతిని విధ్వంసం చేసిన తీరుపై చంద్రబాబు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. "తెలుగు జాతికి గుర్తింపు లేని రోజుల్లో పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ చేసి రాష్ట్రాన్ని సాధిస్తే, గత పాలకులు రాజధానితో మూడు ముక్కలాట ఆడారు. అమరావతిని శ్మశానం అన్నారు, ఎడారి అన్నారు. రాజధాని లేని పరిస్థితి తీసుకొచ్చారు. పొట్టి శ్రీరాములు త్యాగాన్ని మొదట్లో ఎవరూ గుర్తించని విధంగానే, రాజధాని కోసం 34,000 ఎకరాల భూములిచ్చిన ఇక్కడి రైతుల త్యాగాన్ని కూడా గత ప్రభుత్వం అవమానించింది. 2019–24 మధ్య రాజధాని రైతులు చేసిన పోరాటం ఒక చరిత్ర," అని అన్నారు.

**అభివృద్ధి, సంక్షేమం మా లక్ష్యం**

టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి ప్రభుత్వం రాష్ట్ర పునర్నిర్మాణం కోసం ఏర్పడిందని, అభివృద్ధి–సంక్షేమాన్ని సమతూకంతో ముందుకు తీసుకెళుతుందని చంద్రబాబు స్పష్టం చేశారు. "మూడేళ్లలో అమరావతిని ఎలా అభివృద్ధి చేస్తామో మీరే చూస్తారు. 'నా రాజధాని అమరావతి' అని ప్రతి ఒక్కరూ గర్వంగా చెప్పుకునేలా తీర్చిదిద్దుతాం. రాష్ట్ర జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును విధ్వంసం చేశారు. ఇప్పుడు దాని నిర్మాణాన్ని వేగవంతం చేశాం. వచ్చే పుష్కరాల కంటే ముందే పోలవరాన్ని జాతికి అంకితం చేస్తాం," అని హామీ ఇచ్చారు.

**ఆర్యవైశ్యులకు భరోసా.. కీలక నిర్ణయాలు**

ఈ సందర్భంగా ఆర్యవైశ్యులకు ప్రభుత్వం అండగా ఉంటుందని చంద్రబాబు భరోసా ఇచ్చారు. "గత ప్రభుత్వంలో ఆర్యవైశ్యులు వ్యాపారాలు చేసుకోలేని భయానక పరిస్థితి ఉండేది. ఇప్పుడు ఆ భయం లేదు. దానధర్మాలకు ముందుండే ఆర్యవైశ్యులు అదే సంకల్పంతో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. వారి మనోభావాలను గౌరవిస్తూ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినాన్ని అధికారికంగా నిర్వహిస్తాం. వాసవీ మాత పుట్టిన పెనుగొండను 'వాసవీ పెనుగొండ'గా మారుస్తున్నాం. వేర్వేరు పేర్లతో ఉన్న ఉపకులాలన్నింటినీ 'ఆర్యవైశ్యులు'గా పరిగణిస్తూ త్వరలోనే జీవో తెస్తాం," అని ప్రకటించారు.

**పవన్ చొరవతో 'అమరజీవి జలధార'**

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవతో ముందుకు తీసుకెళుతున్న, ఇంటింటికి నీళ్లిచ్చే కేంద్ర ప్రభుత్వ పథకం 'జల్ జీవన్ మిషన్'కు రాష్ట్రంలో 'అమరజీవి జలధార' అని పేరు పెడుతున్నట్లు చంద్రబాబు తెలిపారు. నీరు తాగే ప్రతీసారి ప్రజలు పొట్టి శ్రీరాములును స్మరించుకోవాలనేదే దీని ఉద్దేశమని వివరించారు. ప్రధాని మోదీ 'వికసిత్ భారత్' లక్ష్యంతో పనిచేస్తున్నారని, దేశంలో ఆంధ్రప్రదేశ్‌ను నంబర్–1 రాష్ట్రంగా నిలపడమే అమరజీవికి మనం ఇచ్చే నిజమైన నివాళి అని చంద్రబాబు పేర్కొన్నారు. అంతర్జాతీయంగా యుద్ధ వాతావరణం ఉన్నప్పటికీ, ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం ముందుకు సాగుతోందని, కష్టకాలంలో సమిష్టిగా పనిచేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిద్దామని పిలుపునిచ్చారు. హెల్తీ, వెల్తీ, హ్యాపీ సొసైటీని ఏర్పాటు చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు.

# యువగళంలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్నా

ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా జరిగిన ఈ విగ్రహావిష్కరణ మహోత్సవంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో పాటు మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమరజీవి త్యాగశిల్పం వద్ద ఆయన పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, "ఒక మనిషి త్యాగం ఒక జాతికి గౌరవంగా నిలిచింది. ఒక దీక్ష ఒక రాష్ట్రాన్ని ఇచ్చింది. పొట్టి శ్రీరాములు గారు మరణం లేని మహనీయుడు, త్యాగానికి మానవరూపం. ఆయన 125వ జయంతి రోజున 58 అడుగుల విగ్రహం రూపంలో మనకోసం మళ్లీ జన్మించారు. ఈ విగ్రహానికి ఏం పేరు పెట్టాలని డూండి రాకేష్ అడిగినప్పుడు, ఆయన త్యాగం గుర్తుకురావాలనే ఉద్దేశంతో 'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్' అని సూచించాను. ఈ విగ్రహం తెలుగుజాతి గొప్పతనాన్ని అమరావతి నుంచి అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళుతుంది" అని వివరించారు.

**యువగళం హామీని నిలబెట్టుకున్నా**

తాను తెలుగువాడినని, ఆంధ్రప్రదేశ్ పౌరుడినని గర్వంగా చెప్పుకుంటున్నానని, ఆ గౌరవాన్ని మనందరికీ ఇచ్చింది పొట్టి శ్రీరాములు అని లోకేశ్ అన్నారు. "యువగళం పాదయాత్రలో ఆర్యవైశ్య సోదరులను అనేకసార్లు కలిసి వారి సమస్యలు చర్చించాను. వారికిచ్చిన మాట ప్రకారం అధికారంలోకి రాగానే అమరావతిలో అమరజీవి విగ్రహం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చాను. ఇచ్చిన హామీని ఇంత తక్కువ సమయంలో నిలబెట్టుకోవడం చాలా ఆనందంగా ఉంది. ఈ విగ్రహంలోని 58 అడుగులు, ఆయన చేసిన 58 రోజుల దీక్షకు సంకేతం. మనం ఒక్కరోజు ఉపవాసం ఉండటానికే ఇబ్బంది పడతాం. అలాంటిది ఒక రాష్ట్రం కోసం ఆయన 58 రోజులు దీక్ష చేసి ప్రాణత్యాగం చేశారు. ఈ చరిత్రను భావితరాలకు అందించడం మనందరి బాధ్యత" అని లోకేశ్ ఉద్ఘాటించారు. కేవలం 194 రోజుల్లోనే విగ్రహ ఏర్పాటు పూర్తి చేసిన కూటమి ప్రభుత్వాన్ని, ట్రస్ట్ సభ్యులను, అధికారులను ఆయన అభినందించారు.

**నిత్య పోరాటయోధుడు పొట్టి శ్రీరాములు**

పొట్టి శ్రీరాములు జీవితాన్ని స్మరించుకుంటూ, ఆయన నిత్య పోరాటయోధుడని లోకేశ్ కొనియాడారు. "ఆయన స్వార్థం లేని ఉద్యమాలు చేశారు. గాంధీజీతో కలిసి సబర్మతి ఆశ్రమంలో పనిచేశారు. స్వాతంత్ర్య పోరాటంలో జైలుకు వెళ్లారు. నెల్లూరులో దళితుల ఆలయ ప్రవేశం కోసం, అంటరానితనంపై పోరాడారు. ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడకపోవడం మహాపాపం అని ప్రకటించి, 'వస్తే రాష్ట్రం, పోతే ప్రాణం' అని నిశ్చయించుకున్నారు. దీక్షకు ఎవరూ స్థలం ఇవ్వకపోతే రోడ్డు మీదే చేస్తానన్న ఆయన స్ఫూర్తి నా యువగళం పాదయాత్రకు ప్రేరణగా నిలిచింది" అని లోకేశ్ గుర్తుచేసుకున్నారు. 1952 అక్టోబర్ 19న మద్రాసులో బులుసు సాంబమూర్తి ఇంట్లో ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించినప్పుడు 53.9 కిలోల బరువున్న పొట్టి శ్రీరాములు, 58వ రోజుకు 38.1 కిలోలకు పడిపోయారని, అయినా వెనకడుగు వేయకుండా ప్రాణత్యాగంతో ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించారని లోకేశ్ వివరించారు. ఆయన ప్రాణత్యాగం కోట్ల మందిని కదిలించి, ఢిల్లీని దిగివచ్చేలా చేసిందని, ఫలితంగా 1953 అక్టోబర్ 1న కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని తెలిపారు.

**భారతదేశ చిత్రపటాన్ని మార్చిన మహనీయుడు**

ప్రముఖ చరిత్రకారుడు రామచంద్ర గుహ వ్యాసాన్ని ఉటంకిస్తూ, "పొట్టి శ్రీరాములు గారి దీక్ష తర్వాతే భారతదేశ చిత్రపటంపై భాషా ప్రయుక్త రాష్ట్రాల రేఖలు ఏర్పడ్డాయని గుహ అన్నారు. అందుకే ఆయనను 'భారతదేశ మెర్కాటర్'గా అభివర్ణించారు. 16వ శతాబ్దంలో ప్రపంచ పటాన్ని రూపొందించిన భౌగోళిక శాస్త్రవేత్త మెర్కాటర్. అంతటి గొప్ప వ్యక్తి చరిత్రను దేశం గుర్తుంచుకునేలా ఈ విగ్రహం దోహదపడుతుంది" అని లోకేష్ అన్నారు. ఈ సందర్భంగా దివంగత ముఖ్యమంత్రి రోశయ్యను స్మరించుకున్న లోకేశ్, ఆయన రాజకీయాలకు అతీతంగా పనిచేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండి రాకేష్ కోరిక మేరకు పొట్టి శ్రీరాములు పేరు మీద స్మారక నాణెం విడుదల కోసం కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తున్నామని లోకేష్ వెల్లడించారు. రాబోయే 12 నెలల్లో స్మృతివనం, ఫొటో గ్యాలరీ, మ్యూజియం, ఆడిటోరియం, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మాణాలను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎస్. సవిత, టీజీ భరత్, పి. నారాయణ, కందుల దుర్గేశ్, నాదెండ్ల మనోహర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎమ్మెల్యేలు, అధికారులు, పొట్టి శ్రీరాములు కుటుంబ సభ్యులు, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

## మొదటి పేజీ తరువాయి

### భారత్‌కు భారీ ఊరట..

లభించింది. ఖతార్ నుంచి ద్రవీకృత పెట్రోలియం గ్యాస్ (ఎల్పీజీ)తో బయలుదేరిన 'శివాలిక్' అనే భారత నౌక, అత్యంత కీలకమైన హార్ముజ్ జలసంధిని దాటి సోమవారం సాయంత్రం 5 గంటలకు గుజరాత్‌లోని ముంద్రా పోర్టుకు సురక్షితంగా చేరుకుంది. ఈ నౌకలో సుమారు 45,000 మెట్రిక్ టన్నుల ఎల్పీజీ ఉంది. ప్రభుత్వ రంగ సంస్థ అయిన షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు చెందిన 'శివాలిక్', 'నందా దేవి' అనే రెండు నౌకలు కలిపి మొత్తం 92,700 మెట్రిక్ టన్నుల ఎల్పీజీని భారత్‌కు తీసుకువస్తున్నాయి. శివాలిక్ ఇప్పటికే తీరానికి చేరుకోగా, 'నందా దేవి' అనే మరో ట్యాంకర్ రేపు ఉదయం గుజరాత్‌లోని కాండ్లా పోర్టుకు రానుంది. ఈ విషయాన్ని కేంద్ర నౌకాశ్రయాలు, షిప్పింగ్ మంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేష్ కుమార్ సిన్హా ధృవీకరించారు. పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో పనిచేస్తున్న భారత నావికులందరూ సురక్షితంగా ఉన్నారని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదని సిన్హా స్పష్టం చేశారు. ప్రస్తుతం హార్ముజ్ జలసంధికి పశ్చిమాన 22 భారత నౌకలు ఉన్నాయని, వాటిలో 611 మంది సిబ్బంది ఉన్నారని తెలిపారు. వీటితో పాటు, యూఏఈ నుంచి సుమారు 81,000 టన్నుల ముడిచమురుతో వస్తున్న 'జగ్ లాడ్కీ' నౌక కూడా ముంద్రా పోర్టుకు వస్తోందని, ఆ నౌకలోని సిబ్బంది కూడా క్షేమంగా ఉన్నారని అధికారులు వెల్లడించారు. ప్రపంచంలోని చమురు, గ్యాస్ ఎగుమతుల్లో దాదాపు 20 శాతం హార్ముజ్ జలసంధి గుండానే జరుగుతాయి. ఈ ప్రాంతంలో ఉద్రిక్తతల నేపథ్యంలో, అధికారులు నౌకల కదలికలను నిశితంగా గమనిస్తూ, షిప్పింగ్ లైన్లకు అవసరమైన మద్దతును అందిస్తున్నారు.

### నేటి రాజకీయాలపై వెంకయ్యనాయుడు కీలక వ్యాఖ్యలు

రాజకీయాల్లోకి రాలేకపోతున్నారని మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు తమ ప్రతినిధులను ఎన్నుకునేటప్పుడు క్యారెక్టర్ (ప్రవర్తన), క్యాలిబర్ (సామర్థ్యం), కెపాసిటీ (పనితీరు), కాండక్ట్ (నడవడిక) అనే నాలుగు అంశాలను తప్పనిసరిగా చూడాలని ఆయన సూచించారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా విజయవాడ కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీలో నిన్న 'వినియోగదారుల అవగాహన, సాధికారత' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. నేటి రాజకీయాల్లో కులం, మతం, ప్రాంతీయత వంటి అంశాలకు ప్రాధాన్యం పెరిగిపోయిందని విచారం వ్యక్తం చేశారు. రాజకీయం, విద్య, వైద్యం అనేవి వ్యాపారం కాదని, అవి ప్రజలకు సేవ చేసే మిషన్లు అని స్పష్టం చేశారు. కానీ నేడు విద్య, వైద్య రంగాలు పూర్తిగా వ్యాపారమయంగా మారిపోవడం బాధాకరమన్నారు. ప్రాథమిక విద్య మాతృభాషలోనే జరగాలని, మాతృభాష కళ్లు లాంటిదైతే, ఆంగ్లం కళ్లజోడు వంటిదని ఆయన అభిప్రాయపడ్డారు. కళ్లు లేకుండా కళ్లజోడు వల్ల ఉపయోగం లేదని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జి. రామకృష్ణ ప్రసాద్, జస్టిస్ చీమలపాటి రవి, సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు ఎం. రాజయ్య, సిద్ధార్థ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ దివాకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

### 18న జూన్ నెల శ్రీవారి ఆర్జిత సేవల టికెట్ల విడుదల

వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. అనంతరం డిప్‌లో ఎంపిక చేస్తారు. డిప్‌లో ఈ–టికెట్లు పొందిన వారు మార్చి 20 నుంచి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లిస్తే.. టికెట్లు మంజూరవుతాయి. 21న ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవా టికెట్లు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను మధ్యాహ్నం 3 గంటలకు తితిదే ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. 23న ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణ టోకెన్ల కోటాను విడుదల చేయనున్నారు. 23న ఉదయం 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు బ్రేక్ దర్శన టికెట్ల కోటా, మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు, దివ్యాంగులకు ఉచిత ప్రత్యేక ప్రవేశ దర్శన టోకెన్ల కోటాను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. 24 ఉదయం 10 గంటలకు ప్రత్యేక ప్రవేశదర్శనం రూ.300 టికెట్ల కోటాను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. అదే రోజు.. మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిలో అద్దె గదుల బుకింగ్ కోటాను విడుదల చేస్తారు.

# యుద్ధరంగంలోకి తొలిసారి ఇరాన్ 'డ్యాన్సింగ్ మిసైల్'..

తాజాగా ఇజ్రాయెల్, యూఎస్ స్థావరాలే లక్ష్యంగా చేసిన దాడుల్లో టెహ్రాన్ అధునాతన క్షిపణులను ప్రయోగించింది. యుద్ధంలో మొదటిసారిగా ఇరాన్ 'సెజ్జిల్ క్షిపణి'ని వినియోగించినట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఈ క్షిపణిని డ్యాన్సింగ్ మిసైల్, అషౌరా వంటి పేర్లతో పిలుస్తారు. సుదూరప్రాంతాల్లోని శత్రు లక్ష్యాలను ఇది సమర్థవంతంగా ధ్వంసం చేయగలదు.

**ఏమిటీ డ్యాన్సింగ్ మిసైల్ ?**

ఇరాన్ స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన డ్యాన్సింగ్ మిసైల్ రేంజి 2,000 కిలోమీటర్ల పైమాటే. ఇది 700 కిలోల వార్ హెడ్‌లను మోసుకెళ్లగలదు. అత్యధిక ఎత్తులో కూడా సమర్థవంతంగా తిరుగుతూ లక్ష్యాన్ని ఢీకొట్టే సామర్థ్యం ఉండడంతో దీనిని డ్యాన్సింగ్ మిసైల్ అని పిలుస్తారు. ఐరన్ డోమ్ వంటి క్షిపణి రక్షణ వ్యవస్థలను తప్పించుకునేలా దీనిని రూపొందించారు. సెంటర్ ఫర్ స్ట్రాటజిక్ అండ్ ఇంటర్నేషనల్ స్టడీస్ ప్రకారం.. ఈ క్షిపణి దాదాపు 18 మీటర్ల పొడవు, 1.25 మీటర్ల వ్యాసం ఉంటుంది. దీని బరువు 23,600 కిలోగ్రాములు. ఈ క్షిపణుల రూపకల్పనను ఇరాన్ 1990లో ప్రారంభించింది. మొదటిసారిగా దీనిని 2008లో పరీక్షించారు. ఆ సమయంలో ఈ క్షిపణి దాదాపు 800 కిలోమీటర్లు ప్రయాణించినట్లు తెలుస్తోంది. మెరుగైన నావిగేషన్ వ్యవస్థలను రూపొందించి 2009లో రెండోసారి పరీక్షించారు. అనంతరం పలుమార్లు పరీక్షించారు. ఆరోసారి ప్రయోగం చేసే సమయంలో ఈ క్షిపణి హిందూ మహాసముద్రంలోకి దాదాపు 1,900 కిలోమీటర్లు ప్రయాణించినట్లు తెలుస్తోంది.

## ఎస్సీ కమిషన్ సభ్యుడు రావాడ సీతారాం జిల్లాలో పర్యటన

### ఫిర్యాదులు స్వీకరణ, అధికారులతో సమీక్ష సమావేశం

**విశాఖపట్నం,సిటిజన్ టైమ్స్, మార్చి 16**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర షెడ్యూల్డ్ కాస్ట్ కమిషన్ సభ్యుడు రావాడ సీతారాం ఈ నెల 17, 18 తేదీలలో విశాఖపట్నం జిల్లాలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఎస్సీ వర్గాలకు సంబంధించిన పలు సమస్యలు, అభ్యర్థనలు స్వీకరించి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. మార్చి 17న ఉదయం 10 గంటలకు విశాఖపట్నం జెడ్పీ సమావేశ మందిరంలో ఎస్సీ వర్గ ప్రజలు, సంఘాల ప్రతినిధుల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నారు. అనంతరం జిల్లా అధికారులతో సమావేశమై సమస్యలపై సమీక్ష నిర్వహించనున్నారు. మార్చి 18న భీమునిపట్నం మండలంలో పర్యటించి నిడిగట్టు గ్రామంలోని ఎస్సీ కాలనీలో స్థల పరిశీలన నిర్వహించనున్నారు. అక్కడి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కార చర్యలపై సూచనలు ఇవ్వనున్నారు. అలాగే భీమునిపట్నం మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించి సామాజిక సంక్షేమ హాస్టళ్లను కూడా సందర్శించనున్నారు.

## ఆధునిక పట్టణంగా గాజువాక అభివృద్ధి

### 65 వ వార్డులో 2.20 కోట్ల పనులకు ఎమ్మెల్యే పల్లా శంకుస్థాపన



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మార్చి 16**

జీవీఎంసీ పరిధిలో అన్ని వార్డులకు సమాన ప్రాధాన్యతను కల్పిస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు.గాజువాక 65 వ వార్డులో సుమారు 2.20 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడుతో కలిసి సోమవారం భానోజీతోట వద్ద శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ కూటమి అధికారశీలోకి వచ్చిన తర్వాత వందలాది కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు.క్రీడాకారులకు అందుబాటులో ఉండేలా ఇండోర్ స్టేడియంను ఆధునీకరించామని, కొండవాలు ప్రాంతాల్లో రక్షణ గోడల నిర్మాణంతో పాటు మెట్ల మార్గాలను,తాగునీటి పైపులైను నిర్మాణం,వీధి రోడ్లు,కాలువలు,కల్వర్టులు నిర్మించామని చెప్పారు.గత ప్రభుత్వంలో అభివృద్ధి సంక్షేమం ప్రచారానికే పరిమితం అయ్యాయని ఆరోపించారు.కూటమి అధికారంలోకి వచ్చాక ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు అన్నింటిని దశలవారీగా అమలు చేసుకుంటూ వస్తున్నామని తెలిపారు.గాజువాక ఒక మోడల్ పట్టణంగా రూపుదిద్దుకోనుందని ఇందుకోసం ఇందుకోసం సమగ్ర ప్రణాళికను రూపొందించామని తెలిపారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్,వార్డు అధ్యక్షుడు రట్టివాసు,బైపిల్లి గాంధీ,వార్డు మహిళా అధ్యక్ష,కార్యదర్శులు కోరుకొండ మంగ,కోట్నీ లక్ష్మి,జనసేన ఇంచార్జి రెయ్యి రత్నశ్రీ,కార్పొరేషన్ డైరెక్టర్ అంగకృష్ణ,కర్రి కృష్ణ,వార్డు వెలమ సంఘం అధ్యక్షుడు భాస్కరరావు,కాకి స్వరూపారాణి, జయంతి చౌదరి,సంధ్య, ఎల్వి రమణ,ఉమా తదితరులు పాల్గొన్నారు.

## జివిఎంసి "ప్రజా సమస్యల పరిష్కార వేదిక"లో 117 వినతులు

### - విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మార్చి 16**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో జీవీఎంసీ లో అన్ని విభాగాలకు కలిపి 117 వినతులు వచ్చాయని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయం సమావేశ మందిరం లో అదనపు కమిషనర్లు , పి.నల్లనయ్య లతో కలసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న"ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమానికి జివిఎంసికి సంబంధించి 117 అర్జీలు / ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. అందులో ముఖ్యంగా మధురవాడ జోన్ కు 25, ఈస్ట్ జోన్ కు 21, వెస్ట్ జోన్ కు 06, నార్త్ జోనుకు 25, సౌత్ జోన్ కు 07, పెందుర్తి జోన్ కు 11, అగనంపూడి జోన్ కు 01, గాజువాక జోన్ కు 07, జివిఎంసి ప్రధాన కార్యాలయానికి 14 ఫిర్యాదులు అందాయని తెలిపారు. జివిఎంసి అడ్మినిస్ట్రేషన్ & అకౌంట్సు విభాగమునకు 05, రెవెన్యూ విభాగమునకు 21, ప్రజారోగ్య విభాగమునకు 09, పట్టణ ప్రణాళిక విభాగమునకు 64, ఇంజినీరింగు విభాగమునకు 13, మొక్కల విభాగమునకు 01, యుసిడి విభాగమునకు 04 కలిపి మొత్తంగా 117 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ఫిర్యాదులకు సంబంధించిన విభాగాధిపతులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను/ఫిర్యాదులను అదే రోజు వెంటనే పరిశీలిస్తూ, సంబంధిత ఫిర్యాదు దారులతో సంప్రదించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, వచ్చిన అర్జీలపై అధికారులు వెంటనే స్పందించి కార్యాచరణ అదే రోజు చేపట్టాలని, ప్రతివారం అదే ఫిర్యాదులు తిరిగి ప్రజలు సమర్పించకుండా ఆయా సమస్యలను నిర్ణీత సమయం లో పరిష్కరించాలని జివిఎంసి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం

### ఇంచార్జి మంత్రి కొల్లు రవీంద్ర -కలెక్టరేట్‌లో ఘనంగా పొట్టి శ్రీరాములు 125 వ జయంతి వేడుకలు







**అనకాపల్లి (సిటిజన్ టైమ్స్), మార్చి 16**

తెలుగు వారి అస్తిత్వాన్ని కాపాడేందుకు అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం చిరస్మరణీయమని జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు 125 వ జయంతిని పురస్కరించుకొని సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి జయంతి వేడుకలో ముఖ్య అతిథిగా పాల్గొని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ తో కలిసి అయన చిత్రపటానికి పుష్పంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించిన జిల్లా ఇంచార్జి మంత్రి, ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు త్యాగాన్ని సదా స్మరించుకోవడం కోసమే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జయంతి వేడుకలు నిర్వహిస్తోంది. ఇప్పుడు అమరావతిలో త్యాగాల విగ్రహం పేరుతో 6.8 ఎకరాల్లో 58 అడుగుల అమరజీవి భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నాం. సాధారణ ఉద్యోగిగా జీవితం ప్రారంభించి.. గాంధీ గారి స్ఫూర్తితో స్వతంత్ర పోరాటంలో భాగస్వామి అయ్యారు. బడుగు బలహీన వర్గాల ప్రజలకోసం పోరాటం చేశారు. భాషా ప్రయుక్త రాష్ట్రం ఏర్పాటు కోసం ఏకంగా నిరాహార దీక్ష చేశారు. ఒంటరిగా మొదలిన్ పోరాటం.. వారి ఆత్మ త్యాగంతో జ్వాలగ్నిగా మారింది. రాష్ట్రం కోసం ప్రాణాలు సైతం త్యాగం చేసిన త్యాగమూర్తి గురించి ప్రతి ఒక్కరికీ తెలియజేయాలి. అలాంటి వ్యక్తి జీవితాన్ని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలి. ప్రజా రాజధాని అమరావతిలో తొలి విగ్రహం పొట్టి శ్రీరాములు గారిది ఏర్పాటు చేసుకోవడం గర్వంగా ఉంది. వారి ప్రాణ త్యాగాన్ని సదా స్మరించు కుంటూ. రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడతామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ మాట్లాడుతూ మాట్లాడుతూ తెలుగు వారి ఆత్మ గౌరవం కోసం ప్రత్యేక రాష్ట్రం కావాలని గాంధేయ మార్గంలో పోరాటం చేసి ప్రాణాలర్పించిన అమర జీవి త్యాగాన్ని ఈ తరం యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. భాషా ఆధారంగా రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణకు కూడా ఆయన త్యాగం ప్రధాన కారణంగా నిలిచిందన్నారు. ఆయన త్యాగం వల్లే ఆంధ్ర రాష్ట్ర ఆవిర్భావం సాధ్యమైందని యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసు కుని సమాజ సేవలో ముందుకు రావాలని ఈ సందర్భంగా కలెక్టర్ విజయ క్రిష్ణన్ పిలుపునిచ్చారు. జాయింట్ కలెక్టర్ శౌర్యా మాన్ పటేల్ మాట్లాడుతూ తెలుగు ప్రజల స్వాభిమానానికి ప్రతీకగా నిలిచిన పొట్టి శ్రీరాములు త్యాగం భారత చరిత్రలో చిరస్మరణీయమని అన్నారు. తెలుగు జాతి చరిత్రలో ఆయన స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఆర్డీఓ షేక్ అయిషా, వివిధ రాష్ట్ర కార్పొరేషన్ల ఛైర్మన్లు దామాచర్ల సత్య, పీలా గోవిందా సత్యన్నారాయణ, మళ్ల సురేంద్ర బాబు, బత్తుల తాతీయ్య బాబు, డి సి ఎం ఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, కలెక్టరేట్ సిబ్బంది, మహిళలు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## జీవీఎంసీలో ఘనంగా అమరజీవి జయంతి వేడుకలు

### పొట్టి శ్రీరాములు ఆశయ సాధనకు కృషి చేద్దాం.

### నగర మేయర్ పీలా శ్రీనివాసరావు





**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మార్చి 16:**

అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాలు మరువలేనవని చరిత్రలో ఎన్నటికీ నిలిచి ఉంటాయని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలను జీవీఎంసీ అదనపు కమిషనర్లు డి.వి రమణమూర్తి, పి.నల్లనయ్య, ఇతర ఉన్నతాధికారులతో కలిసి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ తెలుగువారి ఆత్మగౌరవాన్ని చాటి చెప్పిన మహా నాయకుడు అమరజీవి పొట్టి శ్రీరాములని కొనియాడారు. మహాత్మా గాంధీ బోధించిన సత్యం, అహింస మార్గాలను ఎంచుకొని హరిజనోద్ధరణ ఆశయ సాధన కొరకు జీవితాంతం కృషి చేశారని, భాషాపరంగా తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం అవసరమని అందుకు 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి తన ప్రాణాలను ఆంధ్ర రాష్ట్ర కోసం అర్పించారని తెలిపారు. ఆయన చేసిన కృషికి చిహ్నంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాజధాని అమరావతిలో 6.8 ఎకరాలలో 58 అడుగుల కాంస్య విగ్రహాన్ని నేడు ప్రారంభించారని తెలిపారు. ఈ కాంస్య విగ్రహ ఆవిష్కరించడం తెలుగువారి ఆత్మగౌరవానికి, నిరంతర స్ఫూర్తికి ప్రతీకగా నిలుస్తుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం

### ఘన నివాళులర్పించిన జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

### కలెక్టరేట్లో ఘనంగా పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలు

**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మార్చి 16**

ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం తన ప్రాణాలను అర్పించిన అమర జీవి పొట్టి శ్రీరాములు త్యాగం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ పేర్కొన్నారు. అమరజీవి 125వ జయంతి సందర్భంగా సోమవారం కలెక్టరేట్ వీసీ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రుల ఆత్మగౌరవం, స్వాభిమానానికి ప్రతీకగా నిలిచిన అమర జీవి త్యాగం అపారమని అన్నారు. ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు ఆయన చేసిన నిరాహార దీక్ష, అంకితభావం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. సమాజం కోసం త్యాగం చేయడం ఎంత గొప్పదో ఆయన జీవితం మనకు తెలియజేస్తుందని చెప్పారు. యువతలో దేశభక్తి, సేవాభావం పెంపొందించేందుకు ఇటువంటి మహనీయుల జీవితాలను తెలుసుకోవడం అవసరమన్నారు. అమర జీవి చూపిన మార్గాన్ని అనుసరిస్తూ సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి రాజేశ్వరి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు, కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



**బీచ్ రోడ్లోని విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళి..:** అమరజీవి 125వ జయంతిని పురస్కరించుకొని స్థానిక ఆర్కే బీచ్ రోడ్డులోని విశ్వప్రియ ఫంక్షన్ హాలు సమీపంలో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఘన నివాళులర్పించారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా బీసీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో అమరజీవి జయంతి వేడుకలు జిల్లాలో ఘనంగా జరిగాయి. బీసీ కార్పొరేషన్ డైరెక్లర్లు, సామాజిక కార్యకర్తలు, వివిధ విభాగాల అధికారులు, ప్రజా ప్రతినిధులు అమరజీవికి ఘన నివాళులర్పించారు. ఆయన త్యాగాన్ని స్మరించుకున్నారు.

## ఘనంగా అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి....



**మలికిపురం సిటిజన్ టైమ్స్, మార్చి 16:**

అంబేడ్కర్ కోనసీమ జిల్లా, మలికిపురం మండలం మలికిపురం సెంటర్ కూడలినందు అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి రాజోలు శాసన సభ్యులు దేవ వరప్రసాద్ ఘన నివాళి అర్పించారు. ఎమ్మెల్యే దేవ మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్ర సాధన కోసం 58 రోజుల పాటు కఠిన దీక్ష చేసి, అశువులు బాసిన అమరజీవి, భాషా ప్రయుక్త రాష్ట్రాల పితామహుడు శ్రీ పొట్టి శ్రీరాములు 125 వ జయంతి సందర్భంగా వారు అందించిన నిరుపమాన సేవలను స్మరించు కుంటున్నామని తెలిపారు. మన వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు కు అమరజీవి జలధారగా నామకరణం చేయడం మనందరికీ గర్వకారం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు ప్రారంభించిన గంటా





**భీమిలి, సిటిజన్ టైమ్స్,మార్చి 16:**

జీవీఎంసీ 3 వ వార్డులో రూ.93.60 లక్షలతో నిర్మించిన జమ్మి చెరువు ఆధునీకరణ, పాత మున్సిపల్ చౌల్ట్రీ భవనం పునర్నిర్మాణం, ఇండోర్ ఫిట్నెస్ జిమ్ పునరుద్ధరణ పనులను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సోమవారం ప్రారంభించారు. అలాగే 1, 3 వార్డుల్లో ప్రతిపాదించిన రూ. 1.70 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక భీమిలి జోన్ లోని 4 వార్డుల్లో రూ. 50 కోట్ల పనులకు శ్రీకారం చుట్టామన్నారు. భోగాపురం ఎయిర్ పోర్టు అందుబాటులోకి వచ్చిన తర్వాత భీమిలి శరవేగంతో అభివృద్ధి చెందుతుందని చెప్పారు. తగరపువలస, భీమిలి మెయిన్ రోడ్డు, బీచ్ రోడ్డు విస్తరణ తొందర్లోనే చేపడతామని తెలిపారు. చారిత్రకమైన భీమిలి గంట స్తంభం అభివృద్ధికి జీవీఎంసీ రూ. 50 లక్షలు మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ఎం.విజయ్ కుమార్, కార్పొరేటర్లు గంటా అప్పలకొండ, గాడు చిన్ని కుమారి లక్ష్మి, జడ్పీటీసీ గాడు వెంకటప్పడు, కూటమి నాయకులు గంటా నూకరాజు, గొలగాని నరేంద్ర, కనకల అప్పలనాయుడు, తమ్మిన సూరిబాబు, కొప్పల రమేష్, భువనేశ్వరి, సూరాల సత్య వరప్రసాద్, వై. అనిల్ ప్రసాద్, గాడు యశ్వంత్, జీరు సత్యం, సింగపూర్ బుజ్జిరాజు తదితరులు పాల్గొన్నారు.

## పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

**భీమిలి, సిటిజన్ టైమ్స్,మార్చి 16**

తెలుగు జాతి ఆత్మగౌరవం కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు భీమిలి క్యాంప్ కార్యాలయంలో సోమవారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి మదరాసు రాష్ట్రంలో ఉన్నప్పుడు తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం కావాలని 58 రోజుల పాటు ఆమరణ దీక్ష చేసి ప్రాణాలు అర్పించిన మహనీయుడని కొనియాడారు. కూటమి ప్రభుత్వం అమరావతిలో పొట్టి శ్రీరాములు పేరిట ఒక స్మృతి వనాన్ని ఏర్పాటు చేసి 58 అడుగుల విగ్రహాన్ని నిర్మించిందన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ఎం. విజయ్ కుమార్, భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కురుమిన రామస్వామి నాయుడు, కార్పొరేటర్లు గాడు చిన్ని కుమారి లక్ష్మి, గంటా అప్పలకొండ, జడ్పీటీసీ గాడు వెంకటప్పడు, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, గంటా నూకరాజు, కొప్పల రమేష్, కనకల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



# పెందుర్తి జోన్ అభివృద్ధికి నిరంతర కృషి

## -నగర మేయర్ పీలా శ్రీనివాసరావు





**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మార్చి 16**

పెందుర్తి అభివృద్ధికి నిరంతరం కృషి చేయడం జరుగుతుందని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన పెందుర్తి జోన్ 96 వార్డులో పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబుతో కలిసి పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి తో పాటు విశాఖ నగరాన్ని ఆర్థిక రాజధానిగా ప్రకటించి అభివృద్ధి పథంలో నడిపిస్తుందని తెలిపారు. సుమారు రూ. 147 లక్షల వ్యయంతో సెంట్రల్ లైటింగ్ ను, సుమారు రూ. 188.90 లక్షల వ్యయంతో పెద్ద చెరువు వాకింగ్ ట్రాక్ బ్యూటిఫికేషన్ మొదలైన అభివృద్ధి పనులను ప్రారంభించామని, అలాగే పెందుర్తి ఎస్టి హాస్టల్ నుండి ప్రశాంతి నగర్ వరకు సుమారు రూ. 198.40 ఎస్ డబ్ల్యు డ్రైన్, గోకాడ చెరువు నుండి సాలిపేట గెడ్డ వరకు సుమారు రూ. 198.10 లక్షల వ్యయంతో ఎస్ డబ్ల్యు డ్రైన్, వెలంపేట ప్రధాన రోడ్డు నుండి కన్యకాపరమేశ్వరి గుడి వరకు సుమారు రూ. 48.50 లక్షల వ్యయంతో తారు రోడ్డు నిర్మాణానికి, పెందుర్తి జంక్షన్ నుండి తాండ్రపాపారాయుడు కళ్యాణమండపం వరకు సుమారు రూ. 49.50 లక్షల వ్యయంతో తారు రోడ్డు నిర్మాణం, మిగిలిన బి.ఆర్.టి.ఎస్ సర్వీస్ రోడ్డులో సుమారు రూ. 169 లక్షల వ్యయంతో రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. అనంతరం పెందుర్తి శాసనసభ్యులు మాట్లాడుతూ పెందుర్తి నియోజకవర్గం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని, కూటమి ప్రభుత్వంలో అభివృద్ధితోపాటు సంక్షేమ కార్యక్రమాలు కూడా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. పెందుర్తి 96 వ వార్డు లో కోట్లాది రూపాయలతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ హెచ్. శంకరరావు, అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# చంద్రంపాలెం హైస్కూల్ అభివృద్ధికి కృషి: గంటా



**మధురవాడ, సిటిజన్ టైమ్స్, మార్చి 16**

రాష్ట్రంలోనే అత్యధిక విద్యార్థులు చదువుతున్న చంద్రంపాలెం హైస్కూల్ ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పారు. సోమవారం సాయంత్రం హైస్కూల్ ను ఆయన సందర్శించారు. విద్యార్థులు ఆడుకునే గ్రౌండ్ లో వర్షపు నీరు నిలవకుండా ఒకటి, రెండు రోజుల్లో చేపట్టబోయే పనులు స్కూల్ పునః ప్రారంభం నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళ్లాలన్నారు. విద్యార్థులు భోజనం చేయడానికి వీలుగా స్కూల్లో డైనింగ్ హాల్ సౌకర్యాన్ని కల్పించాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా స్కూల్లో సెక్యూరిటీని పటిష్టం చేసి, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. దీంతో పాటు పోలీస్ పెట్రోలింగ్ తో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని పేర్కొన్నారు. హైస్కూల్ నీటి అవసరాల కోసం బోరు తవ్వించడంతో పాటు మున్సిపల్ వాటర్ కనెక్షన్ కూడా ఇవ్వాలని.. సంప్ ఏర్పాటు చేయాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. స్కూల్లో స్టేజ్ కావాలని హెడ్ మాస్టర్ కోరగా పరిశీలిస్తామని గంటా తెలిపారు. కార్యక్రమంలో యువ నాయకుడు గంటా రవితేజ, రీజనల్ జాయింట్ డైరెక్టర్ విజయ్ భాస్కర్, సమగ్ర శిక్ష అభియాన్ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరక్టర్ చంద్రశేఖర్, డిప్యూటీ డీఈఓ సోమేశ్వరరావు, జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు, హెడ్ మాస్టర్ ఎం. వెంకట్రావు, సమగ్ర శిక్ష ఈఈ నరసింహారావు, డీఈలు మణికుమార్, సురేష్, డిప్యూటీ తహసీల్దార్ రాజేష్, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, మొల్లి లక్ష్మణరావు, యార్లగడ్డ జీవన్ కుమార్, కె. అచ్యుతరావు, మాన్యాల సోంబాబు, పిల్లా వెంకట్రావు, వాండ్రాసి అప్పలరాజు, నాగోతి సత్యనారాయణ, మామిడి దుర్గారావు, బోయి రమాదేవి, డివీస్ మేనేజర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ కొరతతో ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసుకోవాలి





**అమలాపురం సిటిజన్ టైమ్స్ మార్చి 16**

ఇరాన్-ఇజ్రాయిల్ యుద్ధ నేపథ్యంలో వాణిజ్య రంగానికి ఎల్పీజీ గ్యాస్ సరఫరా నిలిపివేయబడిన దృష్ట్యా దేవాలయాల్లో నిర్వహిస్తున్న అన్నదానం, అక్షయపాత్ర కార్యక్రమాలు అన్నా క్యాంటీన్ల నిర్వహణలో గ్యాస్ కొరతను అధిగమించేందుకు ప్రత్యామ్నాయంగా సౌరశక్తితో కుకింగ్ ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి. నిశాంతి మున్సిపల్ కమిషనర్లు,దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో మున్సిపల్ కమిషనర్లు, దేవాదాయ ధర్మాదాయ శాఖ, నెడ్‌క్యాప్ అధికారులతో సమావేశం నిర్వహించారు. అక్షయపాత్ర కార్యక్రమం జరుగుతున్న ప్రముఖ దేవాలయాలు, అన్నా క్యాంటీన్లలో వినియోగదారుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో, వచ్చే వారం రోజుల్లో అధికారులు నివేదిక రూపొందించి ఎల్పీజీ గ్యాస్‌కు ప్రత్యామ్నాయంగా కుకింగ్ ఏర్పాట్లు చేయడానికి సిద్ధం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, ఈవోలు భవాని, చక్రధర్ రావు,డీఎస్ఓ ఉదయ భాస్కర్, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ పి. శ్రీనివాస్, మార్కెటింగ్ శాఖ ఏడీ కే. విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

# నాటకీయ పరిణామాల మధ్య వైయస్సార్ గ్రామ శాఖ అధ్యక్షులుగా అడపా

**అమలాపురం, సిటిజన్ టైమ్స్ 16 మార్చి**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి .గన్నవరం నియోజవర్గం అయినవిల్లి మండలం వీరవల్లిపాలెం గ్రామంలో నాటకీయ పరిణామాల మధ్య వైఎస్ఆర్సిపి గ్రామ శాఖ అధ్యక్షుడిగా అడపా వెంకట రామకృష్ణారావు (రాంబాబు) నియమితులయ్యారు. వైయస్సార్ పార్టీ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు జిల్లా చిర్ల జగ్గిరెడ్డి పార్టీ కార్యాలయంలో నియామకం చేసారు. ఈ కార్యక్రమంలో అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకులు జక్కంపూడి విజయలక్ష్మి, పి. గన్నవరం నియోజవర్గం కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, ఆంధ్రప్రదేశ్ వైయస్సార్ పార్టీ ప్రచార కార్యదర్శి మెండగుదటి శ్రీరామచంద్రమూర్తి, గంగాధర్ రావు, మేడిశెట్టి సూర్యనారాయణ పార్టీ ప్రముఖ నాయకులు ఉన్నారు. ఈ సందర్భంగా నూతన గ్రామ శాఖ అధ్యక్షులు కు అభినందనలు తెలిపినారు.




# జాయింట్ కలెక్టర్ నిశాంతిని ఘనంగా సత్కరించిన జిల్లా యంత్రాంగం




**అమలాపురం సిటిజన్ టైమ్స్ మార్చి 16**

పరిపాలనలో వేగం, పార దర్శకత ఉన్నప్పుడే సామాన్య ప్రజలకు ప్రభుత్వ ఫలాలు సకాలంలో అందుతాయని జిల్లా పౌరసరఫరాల అధికారి అడపా ఉదయభాస్కర్ అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ నందు ఇ -ఆఫీస్ దస్త్రాల పరిష్కారంలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన జాయింట్ కలెక్టర్ టి. నిశాంతి వారిని జిల్లా యంత్రాంగం ఘనం గా సత్కరించింది. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీమతి టి. నిశాంతి పరిపాలనలో తనదైన ముద్ర వేస్తూ, ఆఫీస్ దస్త్రాల పరిష్కారంలో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారని డిఎస్ఓ తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక గుర్తింపు లభించిన సందర్భంగా జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా స్థాయి అధికారులు ఆమెను ఘనంగా సత్కరిం చారన్నారు.ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను సకాలంలో పరిష్కరించి, పారదర్శకమైన పాలన అందించడంలో ఆమె ప్రదర్శించిన చొరవకు కృషికి గుర్తింపుగా ఈ అవార్డు దక్కిందన్నారు.?అధికారుల అభినందనలు తెలుపుతూ జిల్లాలోని వివిధ శాఖల ఉన్నతాధి కారులు ఆమెను కలిసి పూలమాలలు, శాలువాల తో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారన్నారు.ఆమె పనితీరు జిల్లా లోని ఇతర అధికారులకు స్ఫూర్తిదాయకమని వారు కొనియాడారన్నారు .జిల్లా జాయింట్ కలెక్టర్‌కు ఫైళ్ల పరిష్కారంలో రాష్ట్రంలో ప్రథమ స్థానం లభించడం గొప్ప విజయంగా అధికారులు అభివర్ణించారుఇ -ఆఫీస్ ఫైళ్ల పరిష్కారంలో రాష్ట్రవ్యాప్తంగా మొదటి స్థానాన్ని సాధించి నందుకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ సత్కార్యం మీ అంకితభావం, క్రమశిక్షణ, ప్రజల పరిష్కారాల పట్ల మీ అపారమైన శ్రద్ధను స్పష్టం చేస్తోందన్నారు.ఫైళ్ల పరిష్కారం అంటే కేవలం కచ్చితమైన పని కాదు, ప్రజల ఆశలను త్వరగా నెరవేనెర వేర్చడమేనన్నారు.మీ నాయకత్వంలో కోనసీమ జిల్లా ఈ రంగంలో అగ్రస్థానం సంపాదించడం అంటే,జిల్లా పాలనా వ్యవస్థకు రాష్ట్రవ్యాప్తంగా మార్గ దర్శకంగా నిలిచింద న్నారు ఈ విజయం భవిష్యత్లో అందరికీ ప్రేరణగా నిలుస్తుంద న్నారు మీ వంటి అధికారులు మాత్రమే కాకుండా, అన్ని శాఖల్లోని సిబ్బంది ఈ ఉదాహరణ పట్టుకుని మరింత శ్రేష్ఠత సాధించాలన్నారు. కోనసీమ జిల్లా మరిన్ని ఘనతలు సాధించాలని కోరుకుంటూ, జాయింట్ కలెక్టర్ కు అందరి పక్షంగా ధన్యవా దాలు, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ నిశాంతి మాట్లా డుతూఈ విజయం కేవలం వ్యక్తిగతమైనది కాదని, జిల్లా యంత్రాంగం అంతా కలిసిక ట్టుగా సమిష్టిగా చేసిన కృషికి దక్కిన గౌరవమని పేర్కొన్నారు. ప్రజలకు సేవలను వేగంగా చేరవేయడమే తమ ప్రథమ ప్రాధాన్యతని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్ర మంలో జిల్లా పౌరసరఫరాల మేనేజర్ పి శ్రీనివాస్, జిల్లా రవాణా అధికారి దేవి శెట్టి శ్రీని వాసరావు జిల్లా ఉద్యాన అధికారి బివి రమణ వినియోగదారుల పోరం అధ్యక్షులు అరిగెల బలరామ కృష్ణమూర్తి కోకోపేట్ సభ్యులు వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుంది -మంత్రి వాసంశెట్టి సుభాష్





**రామచంద్రపురం /విజయవాడ సిటిజన్ టైమ్స్ మార్చి 16**

స్థానిక లేబర్ కమిషనర్ వారి కార్యాలయంలో బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్స్ వెల్ఫేర్ బోర్డు సమావేశంలో పాల్గొన్న కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. విజయవాడ లో నిర్వహించిన బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్మికులకు సామాజిక భద్రత, ఆరోగ్య సేవలు, విద్యా సహాయం, ప్రమాద బీమా వంటి పథకాలను మరింత సమర్థంగా అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. నిర్మాణ కార్మికుల నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని, అర్హులైన ప్రతి కార్మికుడు సంక్షేమ పథకాల లబ్ధి పొందేలా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. కార్మికుల సంక్షేమం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బోర్డు చైర్మన్ వలవల బాబ్జి సభ్యులు, కార్మిక శాఖ సెక్రెటరీ శేషగిరి బాబు, కార్మిక శాఖ కమిషనర్ గంధం చంద్రుడు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అక్షరాంధ్ర (ఉల్లాస్) ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ అసెస్‌మెంట్ పరీక్షలకు మంచి స్పందన



**కాకినాడ సిటిజన్ టైమ్స్ మార్చి 16**

ఆంధ్రప్రదేశ్‌లో 15 మార్చి 2026న నిర్వహించిన అక్షరాంధ్ర ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ అసెస్‌మెంట్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా అభ్యాసకులు భారీగా హాజరయ్యారు. 1231 కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షలకు సుమారు 1,00,911 మంది (97.27 శాతం) వయోజనులు హాజరై, నిరక్షరాస్యత నిర్మూలనకు మద్దతు తెలిపారు.అలాగే కొన్ని మండలాల్లో 99-100% హాజరు నమోదైంది.కాకినాడ జిల్లాలో పరీక్షకు 1,03,758 మందికి గాను 1,00,911 మంది హాజరు కాగా వారిలో 97.05% మంది ఉత్తీర్ణులు అయ్యారు. కాకినాడ జిల్లాలో వయోజన అక్షరాస్యత సాధనలో భాగంగా నిర్వహించిన ఈ పరీక్ష విజయవంతం కావడం ఆనందదాయకమని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి అన్నారు.పరీక్షకు హాజరైన వారిలో 97.05% మంది ఉత్తీర్ణులు కాగా, 2,964 మంది మరింత మెరుగుదల అవసరంగా గుర్తించడం జరిగిందన్నారు.వారి కోసం ప్రత్యేక దృష్టి సారించాలని క్షేత్రస్థాయిలో శిక్షకులకు సూచించడం జరిగిందన్నారు.

# అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహ ప్రారంభోత్సవంలో పాల్గొన్న రామం

**అమలాపురం సిటిజన్ టైమ్స్ మార్చి 16**


అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా సోమవారం ఉదయం అమరావతి దగ్గరలోని తుళ్లూరు గ్రామంలో అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన పొట్టి శ్రీరాములు 58 అడుగుల కాంస్య విగ్రహన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్, రాష్ట్ర ఆర్యవైశ్యుల 42 డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్, తదితర మంత్రులు ప్రజాప్రతినిధులు ఆధ్వర్యంలో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాల రామం పాల్గొన్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు.



## తాటిపాకలో అమరజీవి పొట్టి శ్రీరాములు 125 జయంతి

### టిడిపి ఇన్చార్జ్ గొల్లపల్లి అమూల్య..





**రాజోలు సిటిజన్ టైమ్స్, మార్చి 16**

భాషా ప్రయోక్త రాష్ట్రాల ఏర్పాటు కొరకు పోరాడి అమరుడైన త్యాగశీలి స్వర్గీయ పొట్టి శ్రీరాములు 125 వ జయంతిని ఆయన తాటిపాక సెంటర్లో గల అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ప్రజలు పార్టీ శ్రేణులతో కలసి పుష్పాంజలి ఘటించినారు. రాజోలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ గొల్లపల్లి అమూల్య అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కోటిపల్లి రత్నమాల, మండల పార్టీ అధ్యక్షులు అనుచూరి సునీత రామ పురుషోత్తం, అడబాల సాయిబాబా, చింతా లక్ష్మి, చింతపల్లి నాగలక్ష్మి, బోళ్ళ సతీష్ బాబు, బోళ్ళ వెంకటరమణ, నల్లా పరంకుశరావు, తదితర పార్టీ శ్రేణులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## గంగమ్మ జాతర మత పెద్దలకు సీఐ కౌన్సిలింగ్



**పి టీఎం ప్రతినిధి మార్చి 16 సిటిజన్ టైమ్స్**

పెద్ద తిప్ప సముద్రం మండలం లో గంగ జాతర పెద్ద ఎత్తున ప్రతి ఏటా నిర్వహిస్తున్నారు అందులో భాగంగా శాంతి భద్రతల దృశ్య టౌన్ ఎస్ ఐ, బి.కొత్తకోట సిఐ ఇరువురు తమ సిబ్బందితో కలిసి మత పెద్దలను పి టియం పోలీస్ స్టేషన్ కు పిలిపించి రేపు జరగబోవు గంగ జాతరను శాంతియుతంగా జరుపుకోవాలని ఆనవాయితిగా జరుగుతున్నగంగ జాతరను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని మత విద్వేషాలను రెచ్చగొట్టే కార్యక్రమాలు చేయకూడదని వారికి వివరించడం జరిగింది. లేనిపక్షంలో అసాంఘిక కార్యక్రమాలు చేపట్టే వారి పైన కేసులు పెట్టాల్సి వస్తుందని సిఐ వివరించడం జరిగింది.

## వార్డ్ ఇన్చార్జిలు చేతుల మీదుగా దేవుని పిల్లలకు 5,000 రూపాయలు చెక్కులు పంపిణీ కార్యక్రమం...

**పిఠాపురం:సిటిజన్ టైమ్స్, మార్చి 16**

కాకినాడ జిల్లా, పిఠాపురం నియోజకవర్గం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పిఠాపురం నియోజకవర్గ శాసనసభ్యులు కొణిదల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ప్రతి నెల ఆయన జీతం నుండి 5,000 రూపాయల చెక్కులు దేవుని పిల్లలకు (తల్లిదండ్రులులేని పిల్లలకు) పిఠాపురం టౌన్ ఇంచార్జ్ డాక్టర్ చిక్కాల వరలక్ష్మి రమణారావు ఆధ్వర్యంలో, మరియు వార్డ్ ఇంచార్జ్ లు పబ్బినీడి దుర్గాప్రసాద్ 26వ వార్డు, గుండు వీరభద్రరావు 23వ వార్డు, పసుపులేటి గణేష్ 18వ వార్డు, వార్డ్ ఇన్చార్జిల చేతుల మీదుగా అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పిఠాపురం వైస్ ఇంచార్జ్ బాలిపల్లి అనిల్ కుమార్,వార్డు ఇంచార్జ్ లు వనం వీరబాబు,గరగ అయ్యప్ప, బాలిపల్లి శివసూర్య,పల్నాటి మధు, సత్యం హరీష్, ఏఎంసి డైరెక్టర్ కామిశెట్టి సత్యవేణి,వార్డ్ ఇంచార్జ్లు, జనసేన నాయకులు, జనసైనికులు, వీర మహిళలు, తదితరులు, పాల్గొన్నారు.



# కడపలో ప్రపంచ వినియోగదారుల దినోత్సవం వేడుకలు






**కడప, సిటిజన్ టైమ్స్, మార్చి 16**

కడపది నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ ఆధ్వర్యంలో ప్రపంచ వినియోగదారుల దినోత్సవం వేడుకలు కడపలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం కమిషన్ స్టేట్ చైర్మన్ మద్దెల సురేష్ బాబు ఆధ్వర్యంలో కడపలోని నిర్మల కాలేజ్ లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నేషనల్ చైర్మన్ డా. సాయి రమేష్ హాజరై వినియోగదారుల హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. వినియోగదారులు కొనుగోలు చేసే వస్తువులపై తప్పనిసరిగా బిల్ తీసుకోవాలని, నాణ్యత లేని వస్తువులు లేదా సేవలు అందించినప్పుడు వినియోగదారుల కోర్టులో ఫిర్యాదు చేసి న్యాయం పొందవచ్చని తెలిపారు. అలాగే కార్యక్రమానికి హాజరైన కడప మున్సిపాలిటీ కమిషనర్, లీగల్ మెట్రాలజీ సర్కిల్ ఇన్స్పెక్టర్ రమేష్ రెడ్డి, అసిస్టెంట్ డ్రగ్ కంట్రోలర్ ఆశా, టీ. డి. పి. డిస్ట్రిక్ట్ జనరల్ సెక్రటరీ హరిప్రసాద్, కమీషనర్ రాకేష్ చంద్రా,హెల్త్ ఆఫీసర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు, కమీషనర్ రాకేష్ చంద్రా మాట్లాడుతూ వినియోగదారుల రక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఫుడ్ సేఫ్టీ, మెడిసిన్స్ నాణ్యత, తూకం కొలతలలో పారదర్శకత వంటి అంశాలపై విద్యార్థులకు మరియు ప్రజలకు అవగాహన కల్పించారు. అదేవిధంగా కన్స్యూమర్ కోర్ట్ డీసీడీఆర్సీ మెంబర్ మురళి క్రిష్ణ మాట్లాడుతూ వినియోగదారుల కోర్టులో కేసులు ఎలా వేయాలి, ఫిర్యాదు చేయడానికి అవసరమైన పత్రాలు ఏమిటి, వినియోగదారులు తమ హక్కులను ఎలా వినియోగించుకోవాలి అనే అంశాలపై వివరంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సామాజిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని, అక్రమాలు గమనించినప్పుడు సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని స్పీకర్లు సూచించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను అతిథులు అభినందించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ది ఎన్. సి. ఆర్. సి.డిస్ట్రిక్ట్ చైర్మన్ కిషోర్, వైస్ చైర్మన్ కోట. సుబ్బారావు, సుబ్బారెడ్డి, సురేష్, రాధాకృష్ణ, శివ, చంద్రశేఖర్,అమరావతి రాజు, చలపతి, ఉమామహేశ్వర్ రావు, బాలకృష్ణ, కళాశాల. ప్రిన్సిపాల్ డా!మోహన్ కుమార్ పాల్గొన్నారు.

## రైతే రాజు - అన్నదాత సుఖీభవతో రైతు కుటుంబాల్లో ఉగాది వెలుగులు: ఎమ్మెల్యే ఆనందరావు

*'రైతన్నా మీకోసం' వారోత్సవాల్లో భాగంగా తాండవపల్లిలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాల పంపిణీ చేసిన ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు*

*తాండవపల్లిలో 122 మంది రైతుల ఖాతాల్లో 'అన్నదాత సుఖీభవ' నిధులు జమ.*

*ఏడాదికి రూ. 20,000 వేల ఆర్థిక సాయం అందిస్తున్న ఏకైక ప్రభుత్వం మన కూటమి ప్రభుత్వం*

**అమలాపురం సిటిజన్ టైమ్స్ మార్చి 16**

రాష్ట్రంలోని ప్రతి రైతు కుటుంబం గౌరవంగా, సంతోషంగా ఉండాలన్నదే కూటమి ప్రభుత్వ సంకల్పమని అమలాపురం శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు అన్నారు. 'రైతన్నా మీకోసం' వారోత్సవాల్లో భాగంగా సోమవారం అమలాపురం మండలం తాండవపల్లి గ్రామంలో ఎమ్మెల్యే పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ రైతు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ.... అన్నదాతకు అండగా 'అన్నదాత సుఖీభవ' ఉంది అని గత ప్రభుత్వం రైతులకు ఏడాదికి కేవలం రూ. 7,500 మాత్రమే ఇచ్చి మోసం చేసిందని, కానీ మన కూటమి ప్రభుత్వం పీఎం కిసాన్ కలిపి ఏటా రూ. 20,000 అందిస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. తాండవపల్లి గ్రామంలోనే 122 మంది రైతుల ఖాతాల్లో మూడో విడత నిధులు జమ అయ్యాయని, దీనివల్ల రైతు కుటుంబాల్లో ఉగాది పండుగ ముందే వచ్చిందని ఆనందం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్ ప్రకారం స్వర్ణాంధ్ర2047 లక్ష్యంగా వ్యవసాయ రంగంలో 15% వృద్ధి సాధించేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే అన్నారు. పోలవరం, వెలిగొండ వంటి ప్రాజెక్టులతో పాటు మైక్రో ఇరిగేషన్ ద్వారా ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తాం. డ్రోన్లు, ఏఐ ద్వారా చీడపీడల గుర్తింపు, సాయిల్ హెల్త్ కార్డుల పంపిణీతో సాగు



ఖర్చు తగ్గించి దిగుబడి పెంచుతాం. తాండవపల్లి వంటి ప్రాంతాల్లో కొబ్బరి, కోకో, ఆయిల్ పామ్ పండించే రైతులకు ప్రభుత్వం నుండి పూర్తి మద్దతు ధర రాయితీలు అందిస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా 46.85 లక్షల మంది రైతులకు రూ. 8,985 కోట్ల సాయం అందించామని, ధాన్యం కొనుగోలు ద్వారా రూ. 11,063 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని ఎమ్మెల్యే వివరించారు. ఆక్వా రైతులకు రూ. 1.50 కే విద్యుత్ ఇస్తూ ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉందన్నారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది" అన్న సూత్రంతో పనిచేస్తున్న చంద్రబాబు నాయుడు కి, పవన్ కళ్యాణ్ కి రైతులందరూ అండగా ఉండాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు, కూటమి నాయకులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన అంబేద్కర్ ప్రీమియర్ లీగ్ ఏపీఎల్ సీజన్-3

### క్రీడలు యువతకు ఉత్సాహాన్ని, క్రమశిక్షణను ఇస్తాయి - ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు







**అమలాపురం సిటిజన్ టైమ్స్ మార్చి 16**

బాలయోగి స్టేడియంలో సందడి నెలకొంది. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్ఫూర్తితో నిర్వహిస్తున్న సీజన్-3 క్రికెట్ టోర్నమెంట్ను శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు సోమవారం తొలి మ్యాచ్ టాస్ వేసి ప్రారంభించి, బౌలింగ్ వేసి క్రీడాకారుల్లో ఎమ్మెల్యే ఆనందరావు ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో సమానత్వం కోసం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అంబేద్కర్ చేసిన పోరాటం ప్రతి ఒక్కరికీ ఆదర్శం. ఆయన పేరుతో ఇటువంటి టోర్నమెంట్లు నిర్వహించడం అభినందనీయం క్రీడల ద్వారా యువతలో ఐక్యత, క్రమశిక్షణ పెరుగుతాయని ఎమ్మెల్యే కొనియాడారు.క్రీడలు కేవలం వినోదం మాత్రమే కాదు, గెలుపోటములను సమానంగా స్వీకరించే మనస్తత్వాన్ని నేర్పుతాయని, యువత అంబేద్కర్ ఆశయాలను పాటిస్తూ ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.అంబేద్కర్ ప్రీమియర్ లీగ్ ద్వారా స్థానిక ప్రతిభను వెలికితీస్తున్న నిర్వాహకులను అభినందిస్తూ, క్రీడాకారులకు ఆల్ ది బెస్ట్ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ కమిటీ సభ్యులు, కూటమి నాయకులు, భారీ సంఖ్యలో క్రీడాకారులు క్రీడాభిమానులు పాల్గొన్నారు.

## వాడపల్లి ఆలయంలో రెండవ రోజు అధ్యయనోత్సవాలు ఘనంగా...

### గరుడ వాహనంపై స్వామివారి ఊరేగింపు...



**ఆత్రేయపురం సిటిజన్ టైమ్స్ మార్చి 16**

కొనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో అధ్యయనోత్సవాలు రెండవ రోజు ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో తీర్థ బిందె నదీజలాల సేకరణ కార్యక్రమంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అనంతరం శ్రీ వేంకటేశ్వర స్వామి సహిత లక్ష్మీ హోమం నిర్వహించారు. తరువాత నిత్యసేవాకాలం దివ్యప్రబంధ పారాయణం భక్తిశ్రద్ధలతో జరిగింది. సాయంత్రం స్వామివారి గ్రామోత్సవం సందర్భంగా పల్లకీ సేవ నిర్వహించి, అనంతరం గరుడ వాహనంపై స్వామివారిని ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమాలు ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు సారథ్యంలో నిర్వహించబడ్డాయి.ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు కాస చాముండేశ్వరి,తమ్మన సాయి ప్రసాద్,మసకపల్లి త్రిమూర్తులు, అర్చక స్వాములు, ఆలయ సిబ్బంది, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

## ఏలూరు జిల్లా లింగపాలెం మండలంలో అధిక లోడుతో ట్రాక్టర్ ట్రాలీలు రవాణా

**లింగపాలెం ( సిటిజన్ టైమ్స్ ) మార్చి 16**

ట్రాక్టర్ ట్రాలీలు అతివేగం, అస్తవ్యస్తమైన లోడింగ్, మరియు సరైన భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్ల బోల్తా పడే అవకాశాలు ఉన్నాయి. ముఖ్యంగా మొక్కజొన్న కండులు లోడుతో వెళ్తున్నప్పుడు, విద్యుత్ తీగలు తగలడం, మలుపులలో అదుపు తప్పడం వంటి ప్రమాదాలు అధికంగా కనబడుతున్నాయి. రైతులు పొలం నుంచి సరుకు రవాణా చేసుకోవాల్సింది పోయి ఏకంగా ఫ్యాక్టరీలకు అధిక లోడుతో ప్రమాదకరంగా రవాణా చేస్తున్న పరిస్థితి. ట్రాక్టర్ డ్రైవర్లకు అవగాహన లేక, లైసెన్సులు లేకుండా ప్రమాదకరంగా నడుపుతున్న టాక్టర్లు. ట్రాక్టర్ సగం లోడుతో ముందుకు కదలక మురాయిస్తే డ్రైవర్ కు ఏం చేయాలో తెలియక దిక్కులు చూస్తున్న పరిస్థితి. రవాణా శాఖ అధికారులు పర్యవేక్షణ చేసి, ట్రాక్టర్ ట్రాలీ యాజమాన్యానికి అవగాహన కలిపిస్తే ప్రమాదాలను అరికట్టవచ్చు.



# ఉగాది మహోత్సవములు ప్రారంభం

**శ్రీశైలం, సిటిజన్ టైమ్స్, మార్చి 16**

ఐదురోజులపాటు (16.03.2026 నుండి 20.03.2026) నిర్వహింపబడే ఉగాది ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. కాగా ఉదయం ఆలయ ప్రాంగణంలో ఉత్సవ ప్రారంభ కార్యక్రమాలు ఆగమశాస్త్రానుసారం జరిపించబడ్డాయి. ఈ సందర్భంగా శ్రీస్వామి అమ్మవార్లకు విశేషపూజలు జరిపించబడ్డాయి.

**యాగశాల ప్రవేశం :** ఉత్సవ నిర్వహణలో భాగంగా ముందుగా కార్యనిర్వహణాధికారి స్థానాచార్యులు (అధ్యాపక), అర్చకస్వాములు, వేదపండితులు, అధికారులు సంప్రదాయబద్ధంగా ఆలయ ప్రాంగణంలో స్వామివార్ల యాగశాల ప్రవేశం చేశారు.

**వేదస్వస్తి :** ఆలయప్రవేశం చేసిన వెంటనే వేదపండితులు వేదపారాయణలు చేసి వేదస్వస్తి నిర్వహించారు.

**శివసంకల్పం :** వేదపఠనం అయిన వెంటనే స్థానాచార్యులు ( అధ్యాపక) , అర్చకస్వాములు, వేదపండితులు, లోకక్షేమాన్నికాంక్షిస్తూ ఉత్సవ సంకల్పాన్ని పఠించారు. దీనికే శివసంకల్పం అని పేరు. ఈ సంకల్పంలో దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించ కుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి దేశం పాడిపంటలతో తులతూగాలని, జనులందరికీ ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాల మరణాలు జరగకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన, ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలంటూ ఆలయ అర్చకులు, వేదపండితులు సంకల్పపఠనం చేశారు.

**గణపతి పూజ :** సంకల్పపఠనం తరువాత ఉత్సవాలు నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతి పూజ జరిపించబడింది.

**పుణ్యాహవచనం :** గణపతిపూజ తరువాత పుణ్యాహవచనం జరిపించబడింది. వృద్ధి మరియు అభ్యుదయాల కోసం ఈ పుణ్యహవచనం జరిపించబడుతుంది.

**చండీశ్వరపూజ :** సంకల్పపఠనం తరువాత చండీశ్వరపూజ జరిపించబడింది. ఈ ఉత్సవాలు క్షేత్రపాలకుడైన వీరభద్రస్వామి పర్యవేక్షణలో, శివపరివార దేవతలలో ఒకరైన చండీశ్వరుని నాయకత్వంలో నిర్వహించబడుతాయని చెప్పబడుతోంది. అందుకే యాగశాల ప్రవేశం తరువాత చండీశ్వరునికి ప్రత్యేకంగా పూజాదికాలు జరపించడం సంప్రదాయం.

**కంకణ పూజ, కంకణధారణ..:** చండీశ్వరపూజ తరువాత కంకణాలకు (రక్షాబంధనాలకు) శాస్త్రోక్తంగా పూజాదికాలు



జరిపించబడ్డాయి. తరువాత అధికారులు, అర్చకస్వాములు కంకణాలను ధరించారు.

**ఋత్విగ్వరణం :** కంకణధారణ తరువాత ఋత్విగ్వరణం నిర్వహించబడింది. ఉత్సవాలలో ఆయా వైదిక కార్యక్రమాలు నిర్వహించమని ఋత్విక్కులను ఆహ్వానిస్తూ వారికి దీక్షావస్త్రాలను అందజేసే కార్యక్రమానికే ఋత్విగ్వరణం అని పేరు.

**అఖండస్థాపన :** ఋత్విగ్వరణం తరువాత అఖండదీపస్థాపన చేయబడింది. అనంతరం వాస్తుపూజ చేయబడింది.

**రుద్రకలశస్థాపన :** వాస్తు హోమం తరువాత మండపారాధన చేసి ప్రత్యేక కలశస్థాపన చేయబడింది. కలశస్థాపన తరువాత కలశార్చన జరిపించబడింది. తరువాత పంచావరణార్చనలు నిర్వహించబడ్డాయి. అనంతరం లోకకల్యాణం కోసం జపానుష్ఠానాలు జరిపించబడ్డాయి.

**అంకురార్పణ :** ఉత్సవాల మొదటిరోజు సాయంకాలం జరిగే అంకురార్పణకు ఎంతో విశేషముంది. ఈ కార్యక్రమములో ఆలయ ప్రాంగణంలోని నిర్ణీత పునీత ప్రదేశములోని మట్టిని సేకరించి యాగశాలకు తీసుకువస్తారు. దీనినే "మృత్సంగ్రహణం" అంటారు. తరువాత ఈ మట్టిని తొమ్మిది పాలికలలో (మూకుళ్ళలో) నింపి, దాంట్లో నవధాన్యాలను పోసి, ఆ మట్టిలో మొలకెత్తించే పనిని ప్రారంభిస్తారు. ఈ అంకురారోపణ కార్యక్రమానికి చంద్రుడు అధిపతి, శుక్లపక్ష చంద్రునివలే పాలికలలోని నవధ్యాన్యాలు సైతం దినదినాభివృద్ధి చెందాలని ప్రార్థిస్తారు. పాలికలలో రోజూ నీరు పోసి నవధాన్యాలు పచ్చగా మొలకెత్తేలా చూస్తారు. అలంకారాలను ఆరోపింపజేసే కార్యక్రమం కాబట్టే దీనికి అంకురార్పణ అని పేరు. ఈ ప్రారంభ పూజా కార్యక్రమములో కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు, అర్చకస్వాములు, వేదపండితులు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**భృంగివాహనసేవ..:** ఈ ఉత్సవాలలో భాగంగానే ఈ సాయంకాలం స్వామిఅమ్మవార్లకు భృంగివాహనసేవ జరిపించబడుతుంది. ఈ సేవలో శ్రీ స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను భృంగివాహనసేవపై వేంచేబు చేయించి విశేషంగా అలంకార మండపములో పూజాదికాలు జరిపించబడుతాయి. తరువాత గ్రామోత్సవం నిర్వహించబడుతుంది. భృంగివాహనాధీశులైన శ్రీస్వామిఅమ్మవార్లను దర్శించడం వలన పనులలో ఏకాగ్రత లభిస్తుందని, పాపాలు హరించబడుతాయని చెప్పబడుతోంది.

**మహాలక్ష్మీ అలంకారం..:** ఉత్సవాలలో భాగంగా శ్రీ అమ్మవారి ఉత్సవమూర్తికి మహాలక్ష్మీ అలంకారం గ్రామోత్సవం జరుగనున్నాయి. చతుర్భుజాలు గల ఈ దేవిపై రెండు చేతులలో పద్మాలను, క్రింది చేతులలో కుడివైపున అభయ హస్తం, ఎడమ వైపు వరముద్రతో దర్శనం ఇవ్వనున్నారు. మహాలక్ష్మీ స్వరూపాన్ని దర్శించడం వలన శత్రుబాధలు నివారించబడి, సకల శుభాలు కలుగుతాయని చెప్పబడుతోంది. అదే విధంగా గ్రామోత్సవంలో నాదస్వరం, కోలాటం, చెక్కభజన, రాజభటులవేషాలు, కేరళ చండీమేళం, కొమ్ముకొయ్య నృత్యం, ముంభాయ్ డోల్ థేష్, విళక్కు, స్వాగత నృత్యం, వీరభద్ర డోలు కుణిత, జాంజ్ పథక్ (కర్ణాటక డోలు) కాళికా నృత్యం, జానపద పగటి వేషాలు, నందికోలు సేవ, గొరవనృత్యం, తప్పెటచిందు, బీరప్పడోలు, నందికోలసేవ, ఢమరుకం, చిడతలు, శంఖం, పిల్లనగ్రోవి, డోలు విన్యాసం, గిరిజన చెంచు నృత్యం తదితర కళారూపాలు గ్రామోత్సవంలో ఏర్పాటు చేయబడ్డాయి.

## పగలే విద్యుత్ వెలుగులు... పట్టించుకోని అధికారులు



**పిఠాపురం/యు.కొత్తపల్లి,(సిటిజన్ టైమ్స్) మార్చి 16:**

రాష్ట్ర ప్రభుత్వం 24 గంటలు, పట్టణ, గ్రామీణ, ప్రాంతాలకు విద్యుత్ సరఫరా చేస్తూ ఉంటే, ట్రాన్కో అధికారుల నిర్లక్ష్యానికి, వీధి దీపాలు రాత్రింబవళ్ళు, వెలుగుతూ ఉన్న పట్టించుకునే వారే కరువయ్యారు. వివరాల్లోకెళితే యు. కొత్తపల్లి మండలం, మూలపేట,నాగులాపల్లి గ్రామాల్లో ఉన్న, పంచాయతీ వీధి దీపాలు, వెలగడానికి, ఆర్పడానికి, ఎలాంటి నియంత్రణ లేదు. దీనితో విద్యుత్ సరఫరా ఉన్నంత సేపూ, వీధి దీపాలు వెలుగుతూనే ఉంటాయి.ట్రాన్కోఅధికారులు పంచాయతీలకు, వేలకు వేలు బిల్లులు వేస్తూ, వసూళ్ళకు నోటీసులు జారీ చేస్తారని , వాటి నియంత్రణకు సచివాలయంలో సెక్రటరీ, లైన్మెన్, ఆపై ఏఇ, దృష్టికి తీసుకు వెళ్లినా ప్రయోజనం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.ఇప్పటికైనా సచివాలయ అధికారులు స్పందించి, వీధి దీపాలు నియంత్రక చర్యలు తీసుకోవాలని, గ్రామస్తులు కోరుతున్నారు.

## తెలుగు జాతిరత్నం పొట్టి శ్రీరాములు.



**తాడేపల్లిగూడెం:( సిటిజన్ టైమ్స్ ): మార్చి:16**

తెలుగువారి ఆత్మగౌరవం కోసం ప్రాణాలర్పించిన త్యాగధనుడు పొట్టి శ్రీరాములు చిరస్మరణీయు లని, ఆయన కీర్తి అజరామరమని శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతిని స్థానిక ఎమ్మెల్యే విడిది కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఎలాంటి గుర్తింపు, అభివృద్ధి లేకుండా వెనకబడి ఉన్న తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కావాలని ఆమరణ నిరాహారదీక్ష చేసి, తెలుగుజాతిని ఉద్ధరించిన మహనీయుడని కీర్తించారు. ఆయన చేసిన అసాధారణ త్యాగం తెలుగు ప్రజల గుండెల్లో తరతరాలు నిలిచి ఉంటుందని అన్నారు. తెలుగు భాషకు, తెలుగువారి భావజాలానికి జాతీయస్థాయిలో గుర్తింపు రావాలని, తెలుగుజాతి అభ్యుదయానికి ప్రత్యేక రాష్ట్రం సాధించాలని ఆయన చేసిన ఉద్యమం స్ఫూర్తిదాయకమని అన్నారు. వ్యక్తిగత స్వార్థం లేకుండా ప్రజల కోసం,తెలుగు జాతి కోసం ఆయన చేసిన ఉద్యమం తెలుగువారి కీర్తిని దేశానికి చాటి చెప్పిందని పేర్కొన్నారు. మన భాష,మన సంస్కృతి, స్వాభిమానాన్ని రక్షించుకుంటూ ఆయన ఆశయాలను సాధించాలనే సంకల్పంతో మనం ముందుకు సాగాలని అన్నారు. అత్యున్నత రాజకీయ లక్ష్యంతో, త్యాగానికి ప్రతీకగా నిలిచిన పొట్టి శ్రీరాములు చూపిన మార్గాన్ని నేటి తరం అనుసరించాలని అన్నారు. నిస్వార్థంగా ప్రజాసేవ ఎలా చేయాలో ఆచరించి చూపిన ధన్యజీవి పొట్టి శ్రీరాములు అడుగుజాడల్లో కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి కృషి చేస్తుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పాండిచ్చేరిలో ఎలక్షన్‌లో యానం నుండి మల్లాడి పోటీకి అంతర్వేదిలో ప్రత్యేక పూజలు...

**సఖినేటిపల్లి సిటిజన్ టైమ్స్, మార్చి 16**

డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీ లక్ష్మి నరసింహస్వామి వారి ఆలయంలో యానం ఎమ్మెల్యే గా మల్లాడి కృష్ణారావు పోటీసేస్తారని, వారి రాజకీయ భవిష్యత్ బాగుండాలకి రాష్ట్ర అగ్నికుల క్షత్రియ సంఘ అధ్యక్షులు బర్రె ప్రసాద్ ఆధ్వర్యంలో శ్రీ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ స్వామివారి కృఫా కటాక్షములు ఎప్పుడూ మా నాయకులు మల్లాడి కృష్ణారావు కు ఉండాలని దేవుణ్ణి ఓరునట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజోలు అగ్నికుల క్షత్రియ సంఘాల అధ్యక్షులు ఈ వెంకటరమణ, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ సాధికారిక కమిటీ సభ్యులు టి ఆచార్యులు, గజమాల వ్యవస్థాపకులు మహా నాగరాజు, సత్యనారాయణ, భైరవస్వామి, నాగరాజు, జయకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



## నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి

### ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు.

### రూ.1.08 కోట్లతో మూడు వెల్ నెస్ సెంటర్లకు శంకుస్థాపన



**మైలవరం:( సిటిజన్ టైమ్స్ ): మార్చి:16:**

మైలవరం నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూనే ఉంటానని స్థానిక శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు. రూ.1.08 కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులతో మైలవరం పట్టణంలో మూడు చోట్ల నిర్మించనున్న మూడు గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు (వెల్ నెస్ సెంటర్లు) నిర్మాణానికి ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు సోమవారం శంకుస్థాపన చేశారు. ఒక్కొక్క భవన నిర్మాణానికి రూ.36 లక్షలు చొప్పున వెచ్చించనున్నారు. మైలవరంలో దేవుని చెరువు పూరగుట్ట రోడ్డు వద్ద, పొందుగల రోడ్డు మసీదు వెనుక, సచివాలయం-3 వద్ద వీటిని నిర్మించనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత మాట్లాడుతూ దేవుని చెరువులో ప్రధాన రహదారులన్నీ సిమెంట్ రోడ్లుగా అభివృద్ధి చేశామన్నారు. పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలో రూ.32.92కోట్లతో సీసీ రోడ్లు నిర్మించినట్లు పేర్కొన్నారు. ఓ పక్క అభివృద్ధితో పాటు పేదల సంక్షేమం కోసం కూడా కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతూనే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఏడు పదుల వయస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రప్రగతి కోసం శ్రమిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ) , తదితరులు పాల్గొన్నారు.

## పట్టాదారు పాస్ పుస్తకాలకు ఎవరూ డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదు


### ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే అధికారులకు ఫిర్యాదు చేయండి.

### డబ్బులు డిమాండ్ చేసేవారు ఏ స్థాయి వారైనా కఠిన చర్యలు తప్పవు.

### పార్టీ కార్యక్రమాలకు ఎవరూ డబ్బులు ఇవ్వొద్దు...బ్రోకర్ల మాటలు నమ్మవద్దు.

### నూజివీడు నియోజకవర్గ ప్రజలకు మంత్రి పార్థసారథి సూచన.

**నూజివీడు (సిటిజన్ టైమ్స్) మార్చి:16:**



రాష్ట్ర గృహ నిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి భూమి పట్టాల పంపిణీ పై కొంత మంది పైరవీలు చేస్తున్నారని పత్రికా ముకంగా ఖండించారు.

కొన్ని రోజులుగా ముసునూరు మండలంలో భూమి పట్టాలకు సంబంధించి కొంతమంది డబ్బులు తీసుకుంటున్నారని వార్తలు వస్తున్నాయి. ఈ విషయంపై రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి తీవ్రంగా స్పందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, భూమి పట్టాలు పూర్తిగా ప్రభుత్వ విధానాల ప్రకారం అర్హులైన పేద ప్రజలకు ఉచితంగా ఇవ్వబడుతున్నాయని తెలిపారు. అధికారులు గానీ, ఒకరి పేరు చెప్పి ఒకరు లేదా ఎవరైనా వ్యక్తులు పట్టాలకు డబ్బులు తీసుకుంటున్నారని విషయం తమ దృష్టికి వస్తే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు పార్టీ పరమైన చర్యలు కూడా తప్పవని హెచ్చరించారు. అలాగే నియోజకవర్గంలోని ఏ గ్రామంలో అయినా సరే మంత్రి కార్యక్రమాలు నిర్వహించేందుకు లేదా ఇతర కారణాలతో ప్రజల నుండి డబ్బులు వసూలు చేయకూడదని స్పష్టం చేశారు. ఎవరైనా ఇలాంటి చర్యలకు పాల్పడితే వారిపై కూడా కఠినమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పేద ప్రజలు ఎవరూ కూడా ఇలాంటి బ్రోకర్ల మాటలు నమ్మి డబ్బులు ఇవ్వవద్దని, ఎవరైనా డబ్బులు అడిగితే వెంటనే సంబంధిత అధికారులకు లేదా మంత్రి క్యాంపు కార్యాలయానికి సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వం పేద ప్రజలకు మంచి ఉద్దేశంతో భూమి పట్టాలు ఇస్తున్న నేపథ్యంలో కొంతమంది మధ్యవర్తులు (బ్రోకర్లు) డబ్బులు తీసుకోవడం చాలా తప్పు అని మంత్రి తీవ్రంగా ఖండించారు. ప్రజలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఎవరు తప్పు చేసినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు.

## ఇంటింటికి బడి బాట- బంగారు బాట...





**సఖినేటిపల్లి సిటిజన్ టైమ్స్, మార్చి 16:**

డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం కేశవదాసుపాలెం పాఠశాలలో 2026 -2027 విద్యా సంవత్సరానికి విద్యార్థులను బడిలో చేర్చుకునే కార్యక్రమంలో భాగంగా గ్రామ కార్య వర్గంతో సమావేశం ఏర్పాటు చేసి పాఠశాల పోస్టర్స్ విడుదల చేశారు. ప్రభుత్వ బడిలో చదువుకునే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాం, బూట్లు, సాక్స్, ఎస్ ఆర్ కె విద్యార్థి మిత్ర పథకం ద్వారా ఉచితంగా అందిస్తున్నారు. శ్రీమతి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం ద్వారా పౌష్టికాహారాన్ని ఉచితంగా అందిస్తున్నారు. దూర ప్రాంతం నుండి వచ్చే విద్యార్థులకు రవాణా చార్జీలు ప్రభుత్వం చెల్లిస్తోంది. ఆహ్లాద కరమైన వాతావరణం లో స్మార్ట్ టీవీలు విద్యార్థులకు ఆసక్తి కలిగేలా బోధించే సుశిక్షితులైన ఉపాధ్యాయులు ఉన్నారని, కావున ప్రభుత్వ బడిలో లభించే నాణ్యమైన ఉచిత విద్యను పాఠశాల పరిసరాలలో నివసించే ప్రజలందరూ సద్వినియోగం చేసుకొని, తమ పిల్లలను పాఠశాలలో చేర్పించ వలసినదిగా కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సరోజ, యు అంజి, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ గంగాచలం, పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు టీ.వీ.ఎల్ సత్యవతి, గ్రామస్తులతో ఈ రోజు ఇంటింటికి తిరిగి ప్రచారం చేసినారు.

# అగ్ని ప్రమాద బాధితులకు మురళీ కృష్ణంరాజు రూ.30 వేలు ఆర్థిక సాయం

-గొంది కొత్తపల్లిలో అగ్నిప్రమాదంతో నిరాశ్రయులైన 3 కుటుంబాలు

-ప్రభుత్వం పక్కా గృహాలు నిర్మించాలని ముదునూరి డిమాండ్



**శంఖవరం, సిటిజన్ టైమ్స్, మార్చ్ 16**

శంఖవరం మండలం గొంది కొత్తపల్లి గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన మూడు కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి రూ.10 వేలు చొప్పున వైసీపీ నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు,ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీ కృష్ణంరాజు ఆర్థిక సహాయం చేశారు.ఈ సందర్భంగా ఆయన బాధిత కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు.ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం దారుణమన్నారు.బాధితులకు తక్షణమే ఆర్థిక సహాయం చేసి, పక్కా గృహాలు నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు.పేదలకు 3 సెంట్ల ఇళ్ల స్థలం,50 ఏళ్లకే పెన్షన్ వంటి అనేక అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి మాట తప్పిన మీరు సర్వం కోల్పోయిన ఇటువంటి నిరుపేదలనైనా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఈగల అప్పారావు,సర్పంచ్ ఈగల విజయదుర్గ,రవికుమార్,వైస్సార్సీపీ సీనియర్ నాయకులు కోన బాబ్జి,కొత్తపల్లి డాక్టర్ యడ్ల సత్యనారాయణ,బౌరువాక గ్రామ సర్పంచ్ దొడ్డి సత్యనారాయణ,గౌరంపేట సర్పంచ్ రామిశెట్టి ఏసుబాబు,పెద్దమల్లాపురం సర్పంచ్ దుర్గాభవాని సుంచెబాబు, గౌరంపేట ఎంపీటీసీ,జువ్వల దొరబాబు,దాడి పుత్రయ్య,యాళ్ల ఏసు బాబు,అంబటి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధి రాష్ట్ర అభివృద్ధికి పునాది

## ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ





**పి గన్నవరం సిటిజన్ టైమ్స్ మార్చి 16**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా,పి. గన్నవరం మండలంలోని పి. గన్నవరం గ్రామంలో రూ.23 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని పి. గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ ఘనంగా ప్రారంభించారు. గ్రామాభివృద్ధి దిశగా మరో ముందడుగు పడిందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,గత ప్రభుత్వం ప్రజల డబ్బును వృథా చేస్తూ అనేక అభివృద్ధి పనులను ప్రారంభించి మధ్యలోనే అసంపూర్తిగా వదిలేసిందని విమర్శించారు. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులను ప్రాధాన్యంగా తీసుకుని, అసంపూర్తిగా ఉన్న పంచాయతీ భవనాలు ఇతర ప్రభుత్వ భవనాలను పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు. గ్రామపంచాయతీ భవనం నిర్మాణం పూర్తికావడం వల్ల గ్రామస్థులకు ప్రభుత్వ సేవలు మరింత సులభంగా అందుతాయని, గ్రామ అభివృద్ధి కార్యక్రమాలు సమర్థవంతంగా నిర్వహించేందుకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధికి పునాది అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, అధికారులు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం గ్రామస్థులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఎల్పిజీ గోదామును తనిఖీ చేసిన జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్..





**కాకినాడ సిటిజన్ టైమ్స్ మార్చి 16**

సోమవారం జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్.. రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ అధికారులతో కలిసి కాకినాడ పోర్టు పరిధిలో ఉన్న బీపీసీఎల్ బోటిలింగ్ ప్లాంట్, తిరుమల లాజిస్టిక్స్ తనిఖీ చేశారు.బులెట్ లోడ్స్ ను వెంటనే రీ ఫిల్లింగ్ చేసి త్వరిత గతిన గ్యాస్ ఏజన్సీ లకు సరఫరా చేయాలని ఈ సందర్భంగా జేసీ ఆదేసించారు. ఈ సందర్భంగా జేసీ అపూర్వ భరత్ మాట్లాడుతూ.. కాకినాడ జిల్లాలో బీపీసీఎల్ బాటిలింగ్ ప్లాంట్ మాత్రమే ఉన్నదన్నారు. మిగిలిన హెచ్పీసీఎల్, ఐవోసీఎల్ కంపనిలకు సంబంధించిన బాటిలింట్ ప్లాంట్లు విశాఖపట్నం, గుమ్మల్ల దొడ్డి లో కలవని, ఎప్పటికప్పుడు సంబంధిత ప్లాంట్ మేనేజర్లు మరియు సేల్స్ ఆఫీసర్లుతో సమన్వయము చేసుకుని, అవసరమైన మేరకు డొమెస్టిక్ సిలిండర్ల ను ప్రతి గ్యాస్ ఏజన్సీకి అందుబాటులో ఉంచడం జరుగుతున్నదని ఆయన తెలిపారు. అనంతరం ఆయన కాకినాడ పట్టణంలో గల శ్రీ ఎజన్సిస్ (హెచ్పీసీఎల్) గ్యాస్ కంపెని గోడౌన్ ను ఆకస్మికంగా తనిఖి చేసినారు.ఈ సందర్భంగా స్టాకు నిల్వల పరిశీలించి, వివరాలు ఆరా తీశారు. సాధారణ బుకింగులు కంటే ఎక్కువ బుకింగులు వచ్చాయని అవసరం ఉన్న వారికి మాత్రమే గ్యాస్ వెంటనే సరఫరా చేయవలని జేసీ ఆదేశించారు. ప్రతి గ్యాస్ బాయ్ ను నిరంతరం పర్యవేక్షణ చేయవలెనని, బిల్లు కంటే ఎక్కువ ధర తీసుకున్నట్లయితే వెంటనే వారిపై చర్య తీసుకొనవలన్నారు. ఏటువంటి ఫిర్యాదులు అందిన గ్యాస్ బాయ్ పై క్రిమినల్ చర్య, డీలరు కు నోటీసు జారీ చేయడం జరుగుతుందని జేసీ హెచ్చరించినారు. కాకినాడ జిల్లాలో వినియోగదారులు వారికి ఎటువంటి ఇబ్బందికి గురికాకుండా నిరంతరం గ్యాసు నిమిత్తం తగు సమాచారం అందించుటకు కాకినాడ కలెక్టరేట్ లో జిల్లా పౌర సరఫరాల సంస్థ కార్యాలయంలో ఫోన్ నెం. 8886903611 తో కంట్రోల్ రూము ఏర్పాటు చేయడం జరిగిందని జేసీ తెలిపారు. ఈ పరిశీలనలో జాయింట్ కలెక్టర్ వెంట కాకినాడ ఆర్డీవో ఎస్. మల్లిబాబు, డీఎస్వో ఆర్ఎస్ఎస్.సత్యనారాయణ రాజు, కాకినాడ రూరల్ తహసీల్దార్ ఎస్ఎల్ఎన్ కుమారి, ఏఎస్ఓ ప్రసన్న లక్ష్మి దేవి, సీఎస్డీటీ టి. శ్రీనివాసరావు, ఇతర రెవెన్యు అధికారులు పాల్గొన్నారు.


## చంద్రబాబు విజన్, లోకేష్ కృషితో పెట్టుబడుల వరద...

# 'బ్రాండ్ ఆంధ్ర'గా అవతరిస్తున్న ఏపీ

**యువతకు ఉద్యోగాలు ఇచ్చే అభివృద్ధి ప్రాజెక్టులను అడ్డుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్న జగన్ రెడ్డి ముఠా**

**ఐదేళ్ల పాలనలో 900కు పైగా పరిశ్రమలను రాష్ట్రం నుంచి తరిమేసిన జగన్ ప్రభుత్వం**

**టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు,**



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్ మార్చి 16 :**

విశాఖపట్నంలో గూగుల్ ఏఐ హబ్ మరియు డేటా సెంటర్ పెట్టుబడిపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో వైఎస్సార్సీపీ తిరుపతి ఎంపీ మద్దిలా గురుమూర్తి దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యంపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు తీవ్రంగా స్పందించారు. యువతకు లక్షలాది ఉద్యోగాలు కల్పించే ప్రాజెక్టులను అడ్డుకోవడమే వైఎస్సార్సీపీ ధోరణిగా మారిందని విమర్శించారు.

**పరిశ్రమలపై వైసీపీ కుట్రలు**

ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రానికి రావాల్సిన పరిశ్రమలను తరిమేసి, పెట్టుబడిదారుల్లో భయాన్ని నింపిన ప్రభుత్వం, జగన్ రెడ్డి ప్రభుత్వమేనని పల్లా ఘాటు గా విమర్శించారు. జగన్ రెడ్డి హయాంలో 913 కంపెనీలు రాష్ట్రాన్ని వదిలి వెళ్లిపోయాయని తెలిపారు. పీసీబీఎల్ కర్నాటకకు, ప్రీమియర్ ఇంజనీరింగ్ తెలంగాణకు తరలిపోవడం పెట్టుబడిదారులు ఎదుర్కొన్న హరాస్‌మెంట్, కమిషన్ డిమాండ్లు, అనిశ్చిత పరిస్థితులకు నిదర్శనమన్నారు. జగన్ రెడ్డి పాలనలో పరిశ్రమలు పారిపోతే... ఇప్పుడు విజనరీ లీడర్ చంద్రబాబు పాలనలో వస్తున్న పెట్టుబడులపై కుట్రలు పన్నడం జగన్ రెడ్డి రాజకీయ దివాలాకోరుతనానికి నిదర్శనమని అన్నారు. మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ ల్యాండ్ పాలసీపై కోర్టులో కేసు వేయగా రాయితీలు లేకుండా పరిశ్రమలు ఎలా వస్తాయని హైకోర్టే ప్రశ్నించిన విషయాన్ని గుర్తుచేశారు. ఇప్పుడు వైసీపీ ఎంపీ మద్దిల గురుమూర్తి భూముల కేటాయింపులపై పిల్ వేసి అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్నారని విమర్శించారు.

**జగన్ హయాంలో పారిపోయిన పరిశ్రమలు**

2014-19 మధ్య రాష్ట్రానికి వచ్చిన కంపెనీల్లో సగానికి పైగా సంస్థలను జగన్ రెడ్డి ప్రభుత్వం తరిమేసిందని పల్లా అన్నారు. టీసీఎస్, కియా అనుబంధ పరిశ్రమలు, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్, హెచ్ఎస్‌బీసీ, లులూ, బీఆర్ పెట్టి గ్రూప్స్, ఏపీపీ పేపర్ పరిశ్రమ, సింగపూర్ స్టార్లర్లు వంటి అనేక సంస్థలు రాష్ట్రాన్ని వదిలి వెళ్లాయని తెలిపారు. దశాబ్దాలుగా రాష్ట్రానికి ఆదాయ వనరుగా నిలిచిన అమర్ రాజా బ్యాటరీస్ కంపెనీని కూడా రాష్ట్రం నుంచి వెళ్లగొట్టారని అన్నారు. సుమారు రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులను తరిమేసిన ప్రభుత్వంగా వైసీపీ చరిత్రలో నిలిచిందని, దాని ఫలితంగా రాష్ట్రంలో నిరుద్యోగిత 24 శాతం వరకు పెరిగిందని పల్లా పేర్కొన్నారు. సంక్షేమం పేరిట మాటలు చెప్పినా అభివృద్ధి మాత్రం శూన్యంగా మిగిలిందన్నారు.

**పారిశ్రామిక రంగానికి రెక్కలు... యువత భవిష్యత్తుకు వెలుగులు**

వైసీపీ పాలనలో పూర్తిగా దెబ్బతిన్న ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక వ్యవస్థను కేవలం 20 నెలల్లోనే పునరుద్ధరించి "బిల్డప్ ఆంధ్ర" నుంచి "బ్రాండ్ ఆంధ్ర"గా మార్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదని పల్లా తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, మంత్రి నారా లోకేష్ నిరంతర కృషి, పట్టుదల, గ్లోబల్ అవుట్‌రీచ్ వల్లే నేడు ఆంధ్రప్రదేశ్ పరిశ్రమలకు స్వర్గధామంగా మారిందని చెప్పారు. దేశంలోనే అత్యుత్తమమైన 25 పారిశ్రామిక విధానాలను అమలు చేసి, దేశ విదేశాల్లో స్వయంగా పర్యటిస్తూ పెట్టుబడిదారుల్లో నమ్మకాన్ని పెంచిన ప్రభుత్వం ఇదేనన్నారు. కేవలం 20 నెలల్లోనే రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు, 25 లక్షలకు పైగా ఉద్యోగ అవకాశాలు రాష్ట్రానికి వచ్చినట్లు తెలిపారు. సీఐఐ భాగస్వామ్య సదస్సు ద్వారా విశాఖ నుంచే ప్రపంచానికి బలమైన సంకేతం పంపామని, రూ.13.25 లక్షల కోట్లకు పైగా పెట్టుబడుల ఒప్పందాలు, 16.13 లక్షల ఉద్యోగావకాశాలు కల్పించేలా 610 ఒప్పందాలు కుదిరాయని చెప్పారు. పరిశ్రమ ఉ వాణిజ్య శాఖకు రూ.3,161 కోట్లు బడ్జెట్‌లో కేటాయించడం, 40,862 పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకాలు చెల్లించేందుకు రూ.1,528.25 కోట్లు కేటాయించడం ద్వారా ఎంఎస్ఎంఈలకు ప్రభుత్వం ఇచ్చే ప్రాధాన్యం స్పష్టమవుతోందన్నారు. పరిశ్రమల మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.400.37 కోట్లు కేటాయించడం పెట్టుబడులకు మరింత అనుకూల వాతావరణాన్ని కల్పిస్తుందని చెప్పారు.

**గూగుల్‌తో విశాఖకు ఏఐ రాజధాని**

ప్రపంచ టెక్ దిగ్గజం గూగుల్‌ను విశాఖకు తీసుకురావడంలో మంత్రి నారా లోకేష్ పాత్ర చారిత్రాత్మకమని పల్లా అన్నారు. రూ.1.35 లక్షల కోట్ల పెట్టుబడితో ఏఐ సిటీ ఏర్పడబోతోందని, దేశంలోనే తొలి ఏఐ హబ్‌గా విశాఖ నిలవబోతుందని తెలిపారు. టీసీఎస్, కాగ్నిజెంట్, సత్వా, రహేజా వంటి ప్రపంచ దిగ్గజ కంపెనీలు కూడా విశాఖలో పెట్టుబడులు పెడుతున్నాయని చెప్పారు. విశాఖలో రిలయన్స్ డేటా సెంటర్ రూ.1.25 లక్షల కోట్ల పెట్టుబడితో రానుండగా, ఎఎంజెడ్ గ్రూప్ సుమారు 10 బిలియన్ డాలర్ల పెట్టుబడిని ప్రకటించిందన్నారు. అనంతపురంలో రెన్యూ విక్రమ్, చిండా వంటి కంపెనీలు పునర్వినియోగ శక్తి రంగంలో పెట్టుబడులు పెడుతున్నాయని తెలిపారు. అనకాపల్లిలో రూ.1.35 లక్షల కోట్ల పెట్టుబడితో అతిపెద్ద స్టీల్ ప్లాంట్‌ను బిర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఏర్పాటు చేయబోతోందన్నారు. దేశవ్యాప్తంగా ప్రకటించిన పెట్టుబడుల్లో ఆంధ్రప్రదేశ్ ఒక్కటే 25.3 శాతం వాటాను సొంతం చేసుకోవడం రాష్ట్రంపై ప్రపంచానికి వచ్చిన నమ్మకానికి నిదర్శనమని పేర్కొన్నారు. 175 నియోజకవర్గాల్లో 175 ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నామని, విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధికి రూ.28 వేల కోట్లు కేటాయించామని చెప్పారు.


**ప్రతి జిల్లాకు ప్రత్యేక అభివృద్ధి హబ్**

రాష్ట్రాన్ని సమతుల్యంగా అభివృద్ధి చేయడానికి ప్రతి ప్రాంతానికి ప్రత్యేక పారిశ్రామిక హబ్‌లను రూపొందిస్తున్నామని పల్లా తెలిపారు. ఉమ్మడి విశాఖను ఐటీ, ఏఐ హబ్‌గా, శ్రీకాకుళాన్ని ఫిషరీస్ మరియు కోస్టల్ లాజిస్టిక్స్ హబ్‌గా, గోదావరి జిల్లాలను పోర్ట్ బేస్డ్ పెట్రో కెమికల్స్ హబ్‌గా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. కృష్ణ జిల్లాను ఫైనాన్స్, లాజిస్టిక్స్ హబ్‌గా, గుంటూరును క్వాంటం, డ్రోన్, ఫుడ్ ప్రాసెసింగ్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ప్రకాశం జిల్లాలో ఫార్మా కెమికల్స్ హబ్, నెల్లూరులో ఎలక్ట్రిక్ వాహనాల తయారీ హబ్, చిత్తూరులో మాన్యుఫాక్చరింగ్ మరియు టూరిజం హబ్, అనంతపురంలో పునర్వినియోగ శక్తి హబ్, కడపలో ఐటీ స్టార్టప్ హబ్, కర్నూలులో డిఫెన్స్ మరియు ఎయిరోస్పేస్ క్లస్టర్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతుండటాన్ని చూసి ఓర్వలేక వైసీపీ నేతలు పెట్టుబడులపై విషం చిమ్ముతున్నారని పల్లా విమర్శించారు. అభివృద్ధిని అడ్డుకునే కుట్రలు చేసినా ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడుల గమ్యస్థానంగా మార్చే కూటమి ప్రభుత్వ సంకల్పాన్ని ఎవరూ అడ్డుకోలేరని ఆయన స్పష్టం చేశారు.

# అమీనాబాద్‌లో మహిళల మీదుగా పోతు దూడ నడక...







**పిఠాపురం /యు. కొత్తపల్లి సిటిజన్ టైమ్స్ మార్చి 16**

కాకినాడ జిల్లా, పిఠాపురం నియోజకవర్గం, యు. కొత్తపల్లి మండలం, అమీనాబాద్ గ్రామంలో సోమవారం పోలేరమ్మ జాతర వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు వినూత్న మొక్కలు చెల్లించుకున్నారు. రోడ్డు పై పడుకున్న వందలాది మంది మహిళల మీదుగా పోతు దూడను నడిపించారు. ఇలా చేస్తే తమకు మంచి జరుగుతుందని, జన్మ ధన్యమౌతందని, భక్తుల నమ్మకం. ఈ అరుదైన ఆధ్యాత్మిక ఘట్టాన్ని వీక్షించేందుకు వేలాదిగా ప్రజలు తరలి వచ్చారు.జాతర పరిసరాలు భక్తి శ్రద్ధలతో కోలాహలంగా మారాయి.

# ముక్తేశ్వరంలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు

**అయినవిల్లి సిటిజన్ టైమ్స్ మార్చి 16**

అమరజీవి పొట్టి శ్రీరాములు125 వ జయంతి సందర్భంగా అయినవిల్లి మండలం, ముక్తేశ్వరంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వస్కా శ్యామ్ సుందర్ ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు కోసం పొట్టి శ్రీరాములు 56 రోజులు లిఆమరణ నిరాహారదీక్ష చేశారని,ఆయన ప్రాణ త్యాగం కారణంగానే తెలుగు వారికి ఒక రాష్ట్రం ఏర్పడిందని,అంతేకాకుండా మహాత్మా గాంధీ తో పాటు ఆయన స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారని అటువంటి మహనీయునికి నివాళులు అర్పించారు. ముదావహమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అంబాజీపేట వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ చిట్టూరి శ్రీనివాస్,రాష్ట్ర కార్యదర్శి మద్దాల సుబ్రహ్మణ్యేశ్వర రావు, పెంద్ర రమేష్,గుమ్మడి వెంకటేశ్వరరావు,దంగేటి రమణ, మట్టపర్తి అచ్యుత్,తోటకూర నాగ జోగి వర్మ,అప్పారి మహేష్, తొత్తరమూడి ప్రభాకరరావు, దంగేటి చిన్న,కాకర లక్ష్మణ్,గెడ్డం రమేష్,మధుర రమేష్,వాసవీ ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు కొత్త కృష్ణ,కార్యదర్శి యలమర్తి ఈశ్వర్, పాబోలు శివ,చవల చిన నాగేశ్వరరావు, పాబోలు నరసింహం, మాతంశెట్టి వీర వెంకట సత్యానారాయణ, యలమర్తి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.





స్టైలిష్ కో-ఆర్డ్ ఫోటోషూట్‌లో కావ్య థాపర్ గ్లామర్‌ను ప్రసరిస్తుంది

# స్టన్నింగ్ డార్క్ లుక్‌లో శ్రుతి హాసన్ గ్లామర్ షో




జిన్నీ వెడ్స్ సన్నీ 2ని ప్రమోట్ చేస్తున్నప్పుడు మేధా శంకర్ గ్రీన్ లెహంగాలో స్టన్స్ చేసింది

టాలీవుడ్ బ్యూటీ శ్రుతి హాసన్ ప్రస్తుతం సోషల్ మీడియాలో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలిచింది. ఒకపక్క తన మధురమైన గొంతుతో మ్యూజిక్ లవర్స్‌ను మైమరపిస్తూనే, మరోపక్క అదిరిపోయే ఫోటోషూట్లతో కుర్రకారు గుండెల్లో సెగలు రేపుతోంది. రీసెంట్‌గా ఆమె షేర్ చేసిన బ్లాక్ అవుట్‌ఫిట్ ఫోటోలు ఇప్పుడు ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్నాయి. ఆ డార్క్ అండ్ బోల్డ్ లుక్‌లో శ్రుతి స్టైల్ చూస్తే ఎవరైనా ఫిదా అవ్వాల్సిందే. అసలు శ్రుతి కొత్త ప్రాజెక్ట్స్ గురించి, ఆ ఫోటోల స్పెషాలిటీ ఏంటో ఇప్పుడు చూద్దాం.

**‘పవళమల్లి’తో మాయ చేస్తున్న శ్రుతి.. మ్యూజిక్ మ్యాజిక్:**

శ్రుతి హాసన్‌కు నటనతో పాటు సంగీతం అంటే ఎంత ప్రాణమో మనకు తెలిసిందే. రీసెంట్‌గా ఆమె మహేష్ వారణాసి మూవీలో ‘సంచారి’ అనే పాటతో మెప్పించగా, ఇప్పుడు ‘పవళ మల్లి’ అనే మరో బ్యూటిఫుల్ సాంగ్‌తో మన ముందుకు వచ్చింది. యంగ్ కంపోజర్ సాయి అభ్యంకర్ సంగీత దర్శకత్వంలో రూపొందిన ఈ పాటలో శ్రుతి తన గంభీరమైన గొంతుతో ప్రాణం పోసింది. ఈ పాట వింటుంటే తెలియని హాయి కలుగుతోందని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. కేవలం నటిగానే కాకుండా, ఒక సింగర్‌గా కూడా తనకంటూ ఒక ప్రత్యేకమైన బ్రాండ్‌ను క్రియేట్ చేసుకుంటోంది శ్రుతి.



**బ్లాక్ డ్రెస్.. రెడ్ బ్యాక్‌గ్రౌండ్.. అదిరిపోయిన ఫోటోషూట్:**

పాటలతో పాటు శ్రుతి లేటెస్ట్ ఫోటోషూట్ ఇప్పుడు వైరల్‌గా మారింది. స్టైలిష్ బ్లాక్ క్రాప్ టాప్, లాంగ్ స్కర్ట్‌తో పాటు ఎంబ్రాయిడరీ చేసిన జాకెట్‌ను ధరించి ఆమె ఇచ్చిన పోజులు అదిరిపోయాయి. డార్క్ కలర్ థీమ్‌లో ఉన్న ఈ ఫోటోలకు రెడ్ బ్యాక్‌గ్రౌండ్ తోడవ్వడంతో అవి మరింత అందంగా కనిపిస్తున్నాయి. మినిమల్ యాక్సెసరీస్, సింపుల్ హెయిర్ స్టైల్‌తో శ్రుతి తన బాడీ లాంగ్వేజ్‌తోనే ఒక పవర్‌ఫుల్ వైబ్‌ను క్రియేట్ చేసింది. ముఖ్యంగా ఆమె కళ్లల్లో ఇంటెన్సిటీ ఫోటోలకు హైలైట్‌గా నిలిచింది.

**లైన్ లో క్రేజీ ప్రాజెక్టులు.. సలార్ 2 కోసం వెయిటింగ్:**

శ్రుతి కెరీర్ ప్రస్తుతం మూడు సినిమాలు, ఆరు పాటలు అన్నట్లుగా సాగుతోంది. తెలుగులో ‘ఆకాశంలో ఒక తార’, తమిళంలో ‘ట్రైన్’ వంటి వెరైటీ సినిమాల్లో ఆమె నటిస్తోంది. అయితే అందరి కళ్లు మాత్రం ప్రభాస్ సరసన ఆమె నటించబోతున్న ‘సలార్ పార్ట్ 2’ మీదనే ఉన్నాయి. ఇక ప్రస్తుతం ఈ సినిమా ప్రీ-ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఇలా అటు సినిమాలతో, ఇటు ఫ్యాషన్ ఇంకా మ్యూజిక్ తో శ్రుతి హాసన్ ఎప్పుడూ వార్తల్లో నిలుస్తూ తన క్రేజ్‌ను డబుల్ చేసుకుంటోంది.

# నమన్ అవార్డ్స్‌లో బీసీసీఐ బ్లండర్ మిస్టేక్స్.. సోషల్ మీడియాలో విమర్శలు







భారత క్రికెట్ నియంత్రణ మండలి నిర్వహించిన వార్షిక నమన్ అవార్డ్స్ కార్యక్రమంలో జరిగిన కొన్ని తప్పిదాల కారణంగా సోషల్ మీడియాలో క్రికెట్ అభిమానులు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. మార్చి 15న ఢిల్లీలో జరిగిన ఈ కార్యక్రమంలో 2025వ ఏడాదిలో అత్యుత్తమ ప్రదర్శన చేసిన ఆటగాళ్లకు అవార్డులు అందజేయడంతో పాటు ఐసీసీ ట్రోఫీలు గెలిచిన భారత జట్లను ప్రత్యేకంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పురుషుల జట్టు 2025లో గెలిచిన ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ, 2026లో సాధించిన టీ20 ప్రపంచకప్ విజయాలకు గాను సత్కారం చేసింది. అలాగే మహిళల జట్టు 2025లో వన్డే ప్రపంచకప్ ట్రోఫీని కైవసం చేసుకోవడంతో బీసీసీఐ ప్రత్యేకంగా అభినందించింది.

అలాగే2025లో అండర్- 19 మహిళల ప్రపంచకప్ గెలిచిన, 2026లో అండర్- 19 మెన్స్ ప్రపంచకప్ సాధించిన జట్లకు కూడా బీసీసీఐ ప్రత్యేకంగా సత్కారం చేసింది. అండర్-19 మహిళల జట్టు కెప్టెన్ నిక్కీ ప్రసాద్ నేతృత్వంలో విజయం సాధించినప్పటికీ, స్టేజ్‌పై ప్రదర్శించిన గ్రాఫిక్‌లో మాత్రం హర్మన్‌ప్రీత్ కౌర్ నాయకత్వంలోని సీనియర్ మహిళల జట్టు ప్రపంచకప్ గెలిచిన ఫోటోను ప్రదర్శించడంతో అభిమానులు ఆశ్చర్యపోయారు. విజేత జట్ల నుంచి ముగ్గురు ప్లేయర్స్ ని స్టేజ్‌పైకి ఆహ్వానించి ప్రముఖ వ్యాఖ్యాత హర్షా భోగ్లేతో మాట్లాడించారు. ఈ సందర్భంగా మహిళల ప్రపంచకప్ గెలిచిన జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, 2026 టీ20 ప్రపంచకప్ గెలిచిన పురుషుల జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, అలాగే ఛాంపియన్స్ ట్రోఫీ విజేత జట్టు వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ స్టేజ్‌పై పాల్గొన్నారు. 2025 ఛాంపియన్స్ ట్రోఫీ విజేత జట్టు కెప్టెన్‌గా ఉన్న రోహిత్ శర్మ ఈ కార్యక్రమానికి హాజరు కాలేదు. దీంతో నిర్వాహకులు మరో పొరపాటు కూడా చేశారు. ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచిన జట్టు కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ పేరు ప్రదర్శించడంతో సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. 2025లో అద్భుత ప్రదర్శన చేసిన గిల్‌కు ప్రతిష్టాత్మకమైన అంతర్జాతీయ క్రికెటర్‌గా (పురుషుల విభాగంలో) శుభ్‌మాన్ గిల్ అత్యంత ప్రతిష్టాత్మకమైన (పాలీ ఉమ్రిగర్ అవార్డును) క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డును అందుకున్నారు. 2025లో అన్ని ఫార్మాట్లలో కలిపి 35 మ్యాచ్‌లలో 1,764 పరుగులు చేసి, సగటు 49తో 7 సెంచరీలు చేసి, అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా గిల్ నిలిచాడు. కాగా ఈ కార్యక్రమంలో జరిగిన పొరపాట్లు సోషల్ మీడియాలో చర్చకు దారితీస్తూ బీసీసీఐపై క్రికెట్ అభిమానులు తీవ్రంగా మండిపడుతున్నారు.

# ఐపీఎల్10 జట్ల కెప్టెన్లు వీరే.. ఏ టీమ్‌కి ఎవరో తెలుసుకుందామా..!




మార్చి 28వ తేదీన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 ప్రారంభం కానుంది. దీంతో ఐపీఎల్ లో ఎన్నో సంవత్సరాలుగా మహేంద్ర సింగ్ ధోనీ, రోహిత్ శర్మ లాంటి వారు ఆయా జట్లను ముందుండి నడిపించారు. దీంతో చెన్నై, ముంబై వంటి టీమ్స్ చెరో ఐదు సార్లు ట్రోఫీని కైవసం చేసుకున్నాయి. కానీ ఇప్పుడు ఐపీఎల్ 2026 సీజన్ సమీపిస్తుంది. దీంతో ఆయా జట్లు నాయకత్వంలో కొన్ని మార్పులు చేశాయి. కొన్ని జట్లు కొత్త కెప్టెన్లతో టోర్నీలోకి వస్తుండగా, మరి కొన్ని టీమ్స్ నయా ప్లేయర్స్ కి ఈసారి కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించడంతో తమ సామర్థ్యాన్ని నిరూపించుకోవడానికి సిద్ధంగా ఉన్నారు.చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు రుతురాజ్ గైక్వాడ్ మరోసారి నాయకత్వం వహించనున్నాడు. ఐదు సార్లు ఛాంపియన్ గా నిలిచిన ఈ జట్టు గత సీజన్‌లో ఆశించిన మేరకు ఫలితాలు సాధించలేకపోయింది. దీంతో లీగ్ మధ్యలో గాయంతో గైక్వాడ్ కూడా జట్టుకు దూరమయ్యాడు. అయితే మహేంద్ర సింగ్ ధోనీ జట్టు పగ్గాలు అందుకున్నప్పటికీ ఫలితం మారలేదు. ఈసారి గైక్వాడ్ బ్యాటింగ్‌తో పాటు నాయకత్వంలో కూడా తన ప్రతిభను చూపించాల్సి ఉంటుంది.

**డిల్లీ క్యాపిటల్స్ – అక్షర్ పటేల్:**

ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు అక్షర్ పటేల్ పూర్తి స్థాయి కెప్టెన్‌గా మొదటిసారి బాధ్యతలు స్వీకరిస్తున్నాడు. జట్టులో అనుభవజ్ఞులు ఉన్నప్పటికీ ఫ్రాంచైజీ అతనిపై నమ్మకం ఉంచింది. గత కొన్నేళ్లుగా జట్టుకు అత్యంత స్థిరమైన ఆటగాడిగా నిలిచిన అక్షర్ ఇప్పుడు కెప్టెన్సీ ఒత్తిడిని ఎలా ఎదుర్కొంటాడో అభిమానులు ఆసక్తిగా చూస్తున్నారు.

**గుజరాత్ టైటాన్స్– శుభ్‌మన్ గిల్:**

గుజరాత్ టైటాన్స్ జట్టుకు శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా కొనసాగుతున్నాడు. 2022లో టైటిల్ గెలిచిన ఈ జట్టుకు 2024లో గిల్ నాయకత్వం చేపట్టాడు. గత రెండు సీజన్లు మంచి ప్రదర్శన చేసినప్పటికీ పూర్తిస్థాయి విజయాన్ని సాధించలేకపోయింది. ఈసారి జట్టు మరింత మెరుగైన ఫలితాలను ఆశిస్తోంది.

**కోల్‌కతా నైట్ రైడర్స్ – అజింక్య రహానే:**

మూడుసార్లు ఐపీఎల్ విజేతలైనా కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టుకు అజింక్య రహానే నాయకత్వం వహించనున్నాడు. అనుభవజ్ఞుడైన రహానే ఒత్తిడిని తట్టుకుని జట్టుని ముందుకు నడిపిస్తాడనే నమ్మకం ఫ్రాంచైజీకి ఉంది. సమతుల్యమైన జట్టుతో ఈసారి మరో టైటిల్ గెలవడమే వారి లక్ష్యంగా పెట్టుకున్నారు.

**లక్నో సూపర్ జెయింట్స్ – రిషభ్ పంత్:**

లక్నో సూపర్ జెయింట్స్ జట్టుకు రిషభ్ పంత్ మరోసారి కెప్టెన్‌గా కొనసాగుతున్నారు. గత సీజన్‌లో అతను బ్యాటింగ్ లో పెద్దగా రాణించలేదు.. కెప్టెన్సీలో కూడా అనుకున్నంతగా సక్సెస్ కాలేదు.. అయినప్పటికీ అతని దూకుడు, ధైర్యం జట్టుకు పెద్ద బలంగా చెప్పాలి.

**ముంబై ఇండియన్స్ – హార్దిక్ పాండ్యా:**

ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన జట్లలో ఒకటైన ముంబై ఇండియన్స్‌కు హార్దిక్ పాండ్యా నాయకత్వం వహిస్తున్నాడు. జట్టులో అనేక మంది ఆటగాళ్లు మ్యాచ్ విన్నర్లు ఉండటంతో ముంబై ఎప్పుడూ బలమైన ప్రత్యర్థిగానే కొనసాగుతుంది. అన్నీ సరిగ్గా కలిసొస్తే ఈసారి టైటిల్ రేసులో ముందుండే అవకాశం ఉంది.

**పంజాబ్ కింగ్స్ – శ్రేయస్ అయ్యర్:**

పంజాబ్ కింగ్స్ జట్టుకు శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా రెండో సీజన్ లో కూడా కొనసాగుతున్నాడు. గత సీజన్‌లో పంజాబ్ ని

ఫైనల్ వరకు చేర్చిన తర్వాత కేవలం 6 పరుగుల తేడాతో టైటిల్ కోల్పోయింది. ఆ ప్రయాణంలో అయ్యర్ కీలక పాత్ర పోషించాడు. ఈసారి జట్టును మరోసారి టైటిల్‌కు చేరవేయాలనే లక్ష్యంతో ముందుకు నడుస్తున్నాడు.

**రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు – రాజత్ పాటిదార్:**

డిఫెండింగ్ ఛాంపియన్స్ అయిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుకు రాజత్ పాటిదార్ కెప్టెన్‌గా ఉన్నాడు. అతని నాయకత్వంలో ఆర్సీబీ తొలి ఐపీఎల్ టైటిల్ గెలిచింది. 18 సంవత్సరాల నిరీక్షణకు తెరదించిన ఆ విజయాన్ని ఈసారి కూడా కొనసాగించాలనే లక్ష్యంతో జట్టు ఉంది.

**సన్‌రైజర్స్ హైదరాబాద్ – ప్యాట్ కమిన్స్:**

సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ ప్యాట్ కమిన్స్ మరోసారి నాయకత్వం వహించనున్నాడు. ఇటీవల అంతర్జాతీయ క్రికెట్‌లో ఎక్కువగా ఆడకపోవడంతో అతను తాజాగా ఈ టోర్నమెంట్‌లోకి ఎంట్రీ ఇవ్వనున్నాడు. ముఖ్యంగా బ్యాటింగ్ విభాగంలో బలమైన జట్టుగా హైదరాబాద్ కనిపిస్తోంది.

**రాజస్థాన్ రాయల్స్ – రియాన్ పరాగ్:**

రాజస్థాన్ రాయల్స్ జట్టుకు యువ ఆటగాడు రియాన్ పరాగ్ కెప్టెన్‌గా బాధ్యతలు స్వీకరించాడు. ఇంతకు ముందు కొన్ని మ్యాచ్‌లకు మాత్రమే నాయకత్వం వహించిన అతను ఇప్పుడు పూర్తి స్థాయి బాధ్యతలు చేపట్టాడు. సంజూ సాంసన్ చెన్నై సూపర్ కింగ్స్ ఫ్రాంచైజీకి మారడంతో పరాగ్ కెరీర్‌లో ఇది కీలకమైన అవకాశంగా మారింది.

దీంతో ఐపీఎల్ 2026లో అనుభవజ్ఞులతో పాటు యువ కెప్టెన్ల మిశ్రమంతో ఆసక్తికరమైన పోటీ నెలకొంది. ప్రతి జట్టు తమ కెప్టెన్ నాయకత్వంలో టైటిల్ కోసం పోరాడేందుకు రెడీ అవుతుంది.

Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776